PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 153 | విజయవాడ, మంగళవారం 3 జనవరి 2023 | 6 + 8 పేజీలు | వెల : రూ. 5. 50

Vol No | Vijayawada, Tuesday 3 January 2023 | Rs

కొత్త ఏడాది గడ్డు కాలమే

- మాంద్యంలోకి మూడోవంతు దేశాలు
- సంక్షోభం అంచున అమెరికా
- ఐఎంఎఫ్ చీఫ్ ఆందోళన

● లోపలి పేజీలో.. ●

విశాఖ - కొల్లామ్ మధ్య శబరిమల ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్రాంతి నేపథ్యంలో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు అత్యధిక సంఖ్యలో ప్రయాణిస్తున్న నేపథ్యంలో విశాఖపట్టణం - కొల్లామ్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు సిహెచ్ రాకేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11న విశాఖపట్టణం నుంచి కొల్లామ్ (ట్రైన్ నెంబరు 08569) బయలుదేరుతుందని తెలిపారు. ప్రత్యేక రైలు దువ్వాడ, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్‌పడి, జోలార్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్, పాల్‌ఘట్, త్రిశూర్, ఆలువ, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, చెంగనచెరి, తిరువళ్ల, చెంగనూరు, మవేలికేర, కాయంకుళం, సస్థాన్‌కోట స్టేషన్లలో రైళ్లు నిలుస్తాయని పేర్కొన్నారు. కొల్లామ్-విశాఖపట్టణం మధ్య 08570 నెంబరు ట్రైన్ 12న బయలుదేరుతుందని తెలిపారు.



నోట్లరద్దును తప్పుబట్టలేం

లక్ష్యాలు నెరవేరాయా లేదా అన్నది ముఖ్యం కాదు

4:1 తీర్పు - జస్టిస్ నాగరత్న అసమ్మతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నోట్లరద్దు చెల్లుబాటు నిర్ణయాన్ని తప్పుబట్టలేమని 4:1 మెజార్టీతో అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. 2016లో నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం రూ.1,000, రూ.500 నోట్లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసింది. పిటిషన్లపై సుప్రీం కోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం డిసెంబర్ 7న విచారణను పూర్తి చేసి, తీర్పు రిజర్వ్ చేసింది. ఈ మేరకు సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ వి రామసుబ్రమణియన్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 382 పేజీల తీర్పు వెలువరించింది. నలుగురు న్యాయమూర్తులు నోట్లరద్దును సమర్థించగా, జస్టిస్ బివి నాగరత్న వ్యతిరేకించారు.

ఆర్‌బిఐకి స్వతంత్ర అధికారం లేదు : జస్టిస్ బిఆర్ గవాయ్

నోట్లరద్దును తీసుకురావడానికి ఆర్‌బిఐకి స్వతంత్ర అధికారం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. మెజారిటీ అభిప్రాయాన్ని జస్టిస్ బిఆర్ గవాయ్ చదివి వినిపించారు. "ఆర్థిక ప్రాముఖ్యత కలిగిన విషయాలలో జోక్యం చేసుకునే ముందు చాలా సంయమనం పాటించాలి. కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వచ్చినందున నిర్ణయం తీసుకునే ప్రక్రియను తప్పుపట్టలేమని పేర్కొంది. మేము అలాంటి అభిప్రాయాలను న్యాయ వ్యవస్థతో భర్తీ చేయలేము" అని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ మధ్య ఆరు నెలల పాటు సంప్రదింపులు జరిగాయి. అటువంటి చర్యను తీసుకురావడానికి సహేతుకమైన సంబంధం ఉంది. దామాషా సిద్ధాంతం వల్ల పెద్ద నోట్ల రద్దు జరగలేదు" అని పేర్కొన్నారు. నోట్లరద్దును తీసుకురావడానికి ఆర్‌బిఐకి స్వతంత్ర

మిగతా 2లో

పెద్ద నోట్ల రద్దును సుప్రీం సమర్థించిందని

భావించలేం !

- సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : పెద్ద నోట్లను రద్దు చేస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు ఈ చర్యను న్యాయ స్థానం సమర్థించినట్లుగా భాష్యం చెప్పలేమని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చర్యపై 4:1 మెజారిటీతో ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు, ఇటువంటి నిర్ణయం తీసుకునే చట్టబద్ధమైన హక్కు కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే వుందంటూ దాన్ని ప్రత్యేకంగా పరిగణించింది. 1934 నాటి ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 26(2)ను ఇది ఉల్లంఘించడం లేదని స్పష్టం చేసింది. అయితే పెద్ద నోట్ల రద్దును చేపట్టాలని ఆర్‌బిఐ, ప్రభుత్వానికి సిఫార్సు చేయాలంటూ ఆర్‌బిఐ చట్టంలోని ఈ సెక్షన్ పేర్కొంటోందంటూ సుప్రీం న్యాయమూర్తుల్లో ఒకరు వ్యతిరేక అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆర్‌బిఐ అభిప్రాయాన్ని కోరిన కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అందువల్ల, ఈ నిర్ణయం అమలు చేయడానికి ముందుగా పార్లమెంట్ ఆమోద ముద్రను తీసుకోవాల్సి వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు నిర్ణయానికి, ఆ చర్య వల్ల సాధించాలనుకున్న లక్ష్యాలకు మధ్య సహేతుకమైన సంబంధముందని మెజారిటీ తీర్పు వ్యాఖ్యానించింది. అయితే, ఈ లక్ష్యం నెరవేరిందా లేదా అనేదానితో సంబంధం లేదని పేర్కొంది.

ఇటువంటి నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి చట్టబద్ధమైన హక్కు వుందని సమర్థిస్తూ ఇచ్చిన ఈ మెజారిటీ తీర్పు, ఈ నిర్ణయం వల్ల కలిగే ప్రభావం గురించి అస్సలు మాట్లాడలేదు. ఈ పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో కోట్లాదిమంది ప్రజలకు ఉపాధి కలిగించే దేశ అసంఘటిత రంగం తీవ్రంగా విధ్వంసానికి గురైంది. చిన్న తరహా పారిశ్రామిక రంగాన్ని స్తంభింపజేసింది. కోట్లాది మంది జీవనోపాధులను దెబ్బతీసింది. 2016లో ఈ నిర్ణయం తీసుకున్న ఒక నెలలోనే

మిగతా 2లో



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న కేరళ మంత్రి పి.రాజీవ్

భీమవరం అరుణారుణం

- సిఐటియు రాష్ట్ర మహాసభ ప్రారంభం
- భారీ బహిరంగ సభ, మహా ప్రదర్శన

ఉద్యమాల పురిటిగడ్డ... రెండో బార్డోలిగా పేరొందిన భీమవరం ఎరుపురంగు పులుముకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కార్మికుల నినాదాలతో పట్టణమంతా మార్మోగింది. భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు తలపెట్టిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ పతాకావిష్కరణతో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమైంది. మధ్యాహ్నం వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన వివిధ తరగతుల కార్మికులతో పట్టణం కిటకిటలాడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై గర్జిస్తూ అత్యంత క్రమశిక్షణాయుతంగా సాగిన మహాప్రదర్శన ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. ప్రారంభ సభ, బహిరంగ సభల్లో జాతీయ, రాష్ట్ర నాయకుల ప్రసంగాలు కార్మిక లోకానికి దిశానిర్దేశం చేసేలా సాగాయి. మూడు రోజులపాటు సాగనున్న మహాసభలో తొలిరోజు చైతన్యవంతంగా, సమరశీలంగా సాగగా, మంగళ, బుధవారాల్లో కార్మిక, ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించడంతోపాటు వాటి పరిష్కారానికి డిమాండ్ల రూపంలో పలు తీర్మానాలను ఆమోదించనున్నారు.



మహాప్రదర్శన అగ్రభాగాన కార్మిక నేతలు

- వివరాలు లోపలిపేజీల్లో

ప్రమాదంలో లౌకికతత్వం

కోర్టు కేసులున్న చోట

ప్రత్యామ్నాయ స్థలాలు

- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోర్టు కేసులు పరిష్కారం కాని చోట వెంటనే ప్రత్నామ్నాయ స్థలాలు చూసి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణశాఖపై సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే నాటికి విద్యుత్తు, మంచినీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలన్నారు. లబ్ధిదారులతో అధికారులు ఎప్పటికప్పుడు మాట్లాడుతుండాలని, నిర్మాణాలు నిర్ణీత దశకు రాగానే విద్యుత్ కనెక్షన్లు కూడా ఇవ్వాలని అధికారులకు సూచించారు. సిఎం ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మొత్తం నాలుగు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు సిఎంకు వివరించారు. ఇందుకు అవసరమైన ల్యాబులు కూడా ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపారు. టిడ్కో కాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల నిర్మాణాల కోసం రూ.6,435 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని చెప్పారు. క్రమం తప్పకుండా లే -అవుట్లకు వెళ్లి నిర్మాణ ప్రగతిని పరిశీలిస్తున్నామని, డిసెంబరు నెలలో నాలుగు సార్లు లే అవుట్లను పరిశీలించినట్లు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఏపి హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్, సిసిఎల్ఎ జి.సాయి ప్రసాద్, ఇంధనశాఖ స్పెషల్ సిఎస్ కె. విజయానంద్, టిడ్కో ఎండి సిహెచ్ శ్రీధర్, సిసిఎల్ఎ కార్యదర్శి ఇంతియాజ్, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి జి. లక్ష్మీషా, గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దీవాన తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణశాఖపై సిఎం జగన్మోహన్‌రెడ్డి సమీక్ష

కొత్త ఏడాదిలోనూ జీతాలకు తిప్పలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త సంవత్సరం తొలి నెలలో కూడా ప్రభుత్వ ఉద్యోగులకు 2వ తేది వరకు జీతాలు అందలేదు. ఆదివారం కావడంతో రెండవ తేది (సోమవారం) అందుతాయని భావించిన వారికి కూడా నిరాశే ఎదురైంది. సోమవారం సాయంత్రం వరకు కూడా ఉద్యోగులకు జీతాలు పడలేదు. రాత్రి కొంతమందికి జీతాలు ఇచ్చినా, పదిశాతం మందికి కూడా అందలేదని తెలిసింది. శుక్రవారమే ఉద్యోగులు, అధికారుల జీతాల బిల్లులు, పింఛనుదారుల బిల్లులు ట్రెజరీకి వెళ్లాయి. అయితే, అవి ఇంకా క్లియర్ కాలేదని చెబుతున్నారు. జీతాలు, పింఛన్లకు కావాల్సిన నిధులు కూడా అందుబాటులో లేకపోవడం కూడా మరో కారణమని సమాచారం. డిసెంబర్ 31వ తేదీన నాటికి రూ. 790 కోట్ల వరకు ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే ఖజానా ఉంది. జనవరి రెండో తేదీన పన్నుల రూపంలో వచ్చిన నగదు కూడా ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాకు మళ్లింది. దీంతో బుధ, గురువారాల్లో జీతాల చెల్లింపు ఉంటుందని అంటున్నారు.

వారిది ప్రైవేటైజేషన్... మాది నేషనలైజేషన్

- బిజెపిపై కెసిఆర్ విమర్శ
- విశాఖ ఉక్కును మోడీ అమ్మేసినా.. తిరిగి ప్రభుత్వపరం చేస్తామని ప్రకటన

● లోపలి పేజీలో.. ●

ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు

రాయపూర్‌లో కాంగ్రెస్ ప్లీనరీ

- సిడబ్ల్యుసి ఎన్నిక, ఆరు అంశాలపై చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి 26 వరకూ చత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. సోమవారం నాడిక్కడ ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైరాం రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాజకీయాలు, ఆర్థికం, అంతర్జాతీయ వ్యవహారాలు, రైతులు, వ్యవసాయం, సామాజిక న్యాయం, సాధికారత, యువకులకు ఉపాధి కల్పించడం, విద్యకు సంబంధించిన ఆరు అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం ప్రకారం ప్లీనరీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)ని ఎన్నుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ సవరణలపై కమిటీ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిడబ్ల్యుసికి 12మందిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నామినేట్ చేస్తారు. మరో 12 మందిని ఎఐసిసి సభ్యులు ఎన్నుకుంటారు. అక్టోబర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 47 మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాహుల్‌గాంధీ భద్రతపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మౌనంగా ఉన్నారని వేణుగోపాల్ విమర్శించారు.

200 యూనిట్లు దాటితే

ప్రిపెయిడ్ మీటర్లు

మొదటి దశలో జిల్లా కేంద్రాలు, అమృత్ సిటీల్లో

వినియోగదారుల నుండి సొమ్ము వసూలు చేస్తాం

విలేకరుల సమావేశంలో విజయానంద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటిన ఇళ్లకు స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేస్తామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ చెప్పారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి దశలో జిల్లా కేంద్రాలు, అమృత్‌సిటీల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 1.89 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారని, వీరిలో మొదటి దశలో 27.68 లక్షల మందికి ప్రిపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిల్లో 3.7లక్షలు ఫీడర్లు, 3.22 లక్షల ప్రభుత్వ కార్యాలయాలు, 1.19 లక్షలు పరిశ్రమలు, 15.47లక్షల వాణిజ్య వినియోగదారులు ఉన్నారని చెప్పారు. వీరుపోను 4.72 లక్షల మంది గృహ వినియోగదారులకూ ప్రి పెయిడ్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేసి, 2023 డిసెంబర్ నాటికి మీటర్లను బిగిస్తామని చెప్పారు. మొదటి దశ పూర్తికాగానే రెండో దశలో 13.5లక్షల కనెక్షన్లకు బిగిస్తామని, వీటికి ఇంకా టెండర్లు పిలవలేదన్నారు. మొదటి దశలో వచ్చిన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని రెండో దశ టెండర్లు పిలుస్తామన్నారు. గతంలో ఐఆర్‌డిఎ మీటర్లు ఏర్పాటు చేసే సమయంలో కూడా గృహ వినియోగదారుల నుంచి మీటర్లకు అయ్యే ఖర్చును వసూలు చేశామన్నారు. మీటర్ల భారం పరిశ్రమలపై పెద్దగా ఉండదన్నారు. కేంద్రప్రభుత్వం ఆదేశాల ప్రకారం రీవ్యాంప్డ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డిఎస్ఎస్)లో భాగంగా ఈ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 2025 మార్చి నాటికి వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు తప్పనిసరన్నారు. కేంద్రం రూపొందించిన నిబంధనలకు అనుగుణంగానే టెండర్లను పిలుస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగానే ఉందని, ఏవరికీ కావాలనే కట్టబెట్టే ఆలోచన లేదన్నారు. విద్యుత్ సంస్థలు నష్టాలు తగ్గించుకునే ప్రక్రియలో ఫీడర్ల అప్‌డేట్‌తో పాటు పలుమార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. ఆర్‌డిఎస్ఎస్‌లో భాగంగా రూ.13,252 కోట్లతో విద్యుత్ సంస్థల్లో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వీటిలో సుమారు 5,480కోట్లు కేంద్రప్రభుత్వం నుంచి గ్రాంటు రూపంలో వస్తాయని తెలిపారు. మీటర్లను బిగిస్తేనే ఈ గ్రాంటు ఇస్తామని కేంద్రప్రభుత్వం నిబంధన విధించిందన్నారు. రాష్ట్రంలో 30శాతం ఓవర్ లోడ్ ఫీడర్లను ఉన్నాయని తాము చేపట్టిన సర్వేలో గుర్తించామని చెప్పారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సిఎండి బి శ్రీధర్, జెఎండిలు ఐ.పృథ్వీతేజ్(హెచ్‌ఆర్), మల్లారెడ్డి(విజిలెన్స్), ఎపిసిపిడిసిఎల్ సిఎండి జె పద్మజనార్ధన్ రెడ్డి, ఎపిఎస్ఇసిఎం సిఇవో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యూరు శ్రీనివాసరావు

అరెస్టు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లాప్రతినిధి




గుంటూరు వికాస్ నగర్‌లో జనతా వస్త్రాలు, చంద్రన్న కానుక పంపిణీలో జరిగిన తొక్కిసలాటకు బాధ్యునిగా పేర్కొంటూ ఉయ్యూరు ఫౌండేషన్ అధినేత ఉయ్యూరు శ్రీనివాసరావును సోమవారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరులో ఈ కార్యక్రమం పెట్టడానికి కారణాలపై ఆయనను పోలీసు అధికారులు విచారిస్తున్నారు. గుంటూరు సెంట్రల్ క్రైమ్ డిఎస్‌పి కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. విచారణ పూర్తయిన తర్వాత ఆయనను కోర్టులో హాజరు పర్చనున్నట్లు సమాచారం. శ్రీనివాసరావు ఇచ్చే సమాచారం ఆధారంగా మరికొందరు టిడిపి నాయకులపైనా కేసుల నమోదుకు పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ ఘటనపై తొలుత అనుమానాస్పద సంఘటనగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత ప్రమాదంగా సెక్షన్లు మార్చారు.

ఎంఎల్‌సి ఎన్నికల తుది జాబితాలో

బోగస్ ఓట్లు ఏరివేయండి

సిపిఎం, సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో బోగస్ ఓట్లు పెద్ద ఎత్తున ఉన్నాయని వాటిని తొలగించాలని సిపిఎం, సిపిఐ డిమాండు చేశాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెల్లి విల్సన్ సోమవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలోనూ బోగస్ ఓట్లు పెద్ద ఎత్తున ఉన్నాయని , వాటిని తొలగించాలని కోరినట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల లిస్టులో బోగస్ ఓట్లపై నిర్దిష్టంగా వివరాలు అందజేసినప్పటికీ జిల్లా స్థాయిలో చర్యలు తీసుకోని ఫలితంగా తుది జాబితాలో వేలాది బోగస్ మరియు అనర్హుల ఓట్లున్నాయని సిఇఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు నిర్దిష్టమైన సమాచారంతో పోలింగ్‌బూత్‌ల వారీగా ఉదాహరణలు సమావేశంలో అందజేసినట్లు పేర్కొన్నారు. బోగస్ ఓట్ల ఏరివేత కోసం జిల్లా స్థాయిలోనూ అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అంగీకరించిన చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ జిల్లాలకు ఈ మేరకు ఆదేశాలిస్తామని తెలిపారని వివరించారు బోగస్ ఓట్లపై అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, సవరణలు నామినేషన్ చివరిరోజుకు పదిరోజుల ముందు వరకూ అందజేయొచ్చని అధికారులు తెలిపారన్నారు. జిల్లాల్లో తుది ఓటర్ల జాబితాను పరిశీలించి పోలింగ్ బూత్‌ల వారీగా బోగస్, అనర్హులైన ఓటర్ల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు పంపాలని పార్టీ శ్రేణులను వారు కోరారు.

ఆధారాలివిగో..

● లోపలి పేజీలో.. ●

సిట్ మెమోను ఎసిబి కోర్టు తిరస్కరణ సబబే

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో హైకోర్టు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ దాఖలు చేసిన మెమోను ఎసిబి కోర్టు కొట్టివేయడాన్ని హైకోర్టు సమర్థించింది. బిజెపి నేత బిఎల్ సంతోష్, తుషార్ వెల్లాపల్లి, శ్రీనివాస్‌లను ఈ కేసులో నిందితులుగా చేరుస్తూ గతంలో సిట్ మెమో దాఖలు చేయగా, ఎసిబి కోర్టు దాన్ని కొట్టివేసింది. ఎసిబి కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిట్ బృందం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఎసిబి కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సిట్ అప్పీలును కొట్టివేసింది.

డ్రగ్స్ స్మగ్లర్ మోహిత్ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో డ్రగ్స్ స్మగ్లర్స్ మోహిత్ అగర్వాల్, మన్యం కృష్ణ కిషోర్‌రెడ్డి ఆదివారం పట్టుబడ్డారు. వీరిపై రాంగోపాల్‌పేట్‌లో నవంబర్ 3న కేసు నమోదైనప్పటికీ వాళ్లిద్దరూ పరారీలో ఉన్నారు. పక్కా సమాచారంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పోలీసులతో కలిసి వీరిద్దరినీ అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు గ్రాముల కొకైన్, రెండు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటర్నేషనల్ డిజె ఈవెంట్లు నిర్వహిస్తున్న మోహిత్ అగర్వాల్.. ముంబయి, గోవా, హైదరాబాద్, బెంగళూరులో పార్టీలు నిర్వహిస్తుంటాడు. హైదరాబాద్‌లోని పబ్‌లలో సైతం ప్రైవేట్ పార్టీలు నిర్వహిస్తున్నాడు. పార్టీలు నిర్వహిస్తూ కొకైన్‌కు బానిసగా మారిన మోహిత్ పలువురికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్‌లో కీలక నిందితుడు ఎడ్విన్‌తో కూడా మోహిత్‌కు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లో కెఎంసి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నడుపుతున్న మన్యం కృష్ణ కిషోర్ రెడ్డి కూడా డ్రగ్స్‌కు బానిసయ్యాడు. డ్రగ్స్ సేవించేందుకు తరచూ గోవా వెళ్లి వస్తుంటాడని, ఎడ్విన్‌తో కూడా పరిచయాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు.. అతనితోపాటు బెంగళూరులోని మరో వ్యక్తితో కిషోర్‌కు పరిచయం ఏర్పడింది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్‌ను ఆ వ్యక్తి ట్రావెల్స్ బస్సుల్లో పంపుతుండగా.. అతనికి కృష్ణ కిషోర్ గూగుల్ పే ద్వారా డబ్బులను పంపి డ్రగ్స్ తీసుకుంటున్నాడని వివరించారు. కీలక నిందితుడు మోహిత్ అగర్వాల్ భార్య సినీ నటి నేహదేశ్ పాండే. అమె పలు తెలుగు సినిమాల్లో నటించారని పోలీసులు చెప్పారు.

మద్య నిషేధంపైన మాటమార్చిన జగన్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం జగన్మోహన్‌రెడ్డి మరోసారి మాటమార్చి, మడమ తిప్పారని, రాష్ట్రంలో మద్యం అమ్మకాలను రెట్టింపు చేస్తూ మద్య నిషేధహామీని తుంగలో తొక్కారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల సందర్భంగా జగన్ మద్యపాన నిషేధంపై ఇచ్చిన హామీని విస్మరించారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక సొంతబ్రాండ్ల మద్యాన్ని తీసుకొచ్చి, రేట్లు విపరీతంగా పెంచి ఆదాయమే లక్ష్యంగా అమ్మకాలు సాగిస్తూ దశలవారీ మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పారని వివరించారు. ఇప్పుడు మద్య నిషేధాన్ని తుంగలో తొక్కారని, పోస్టర్లు, ప్రకటనల్లో మద్య నిషేధమనే పదాన్ని తీసేసి, మద్య నియంత్రణ అని పెట్టారని విమర్శించారు.

ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొంటాం

47,191మంది వైద్య సిబ్బంది నియామకం : కృష్ణబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కోవిడ్ వైరస్ కొత్తరూపం ఒమిక్రాన్, బిఎఫ్-7 వైరస్‌లపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఎంటి కృష్ణబాబు తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధంగా వుందని పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని ఆర్‌అండ్‌బి బిల్డింగ్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో సూపర్ స్పెషాలిటి డాక్టర్ పోస్టులతోపాటు వివిధ విభాగాల్లో మొత్తం 46,191 నియామకాలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో హాస్పిటల్స్‌లో రోగులకు చెల్లించే డైట్ చార్జీలను గతంలో ప్లేట్‌కు రూ 40 వుంటే రూ.80కు పెంచామని అన్నారు. డైట్ కాంట్రాక్టర్ల బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని, గతంలో సగటున నెలకు కోటి చెల్లిస్తే ఇప్పుడు రూ.12 కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖపై రూ.17,600 కోట్లు ఖర్చు చేసిందన్నారు.

గుంటూరు మృతులకు 3లక్షల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జనతా వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నాట్ మాజీ అధ్యక్షులు, ఎన్టీఆర్ ట్రస్ట్ డైరెక్టర్ మన్నవ మోహనకృష్ణ ప్రకటించారు. క్షతగాత్రులైన వారికి మన్నవ మోహనకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అన్ని విధాలుగా అండగా ఉంటానని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వారిది ప్రైవేటైజేషన్... మాది నేషనలైజేషన్

- బిజెపి పై కెసిఆర్ విమర్శ
- విశాఖ ఉక్కును మోడీ అమ్మేసినా.. తిరిగి ప్రభుత్వపరం చేస్తామని ప్రకటన
- తోట చంద్రశేఖర్, రావెల కిషోర్, చింతల పార్థసారథికి బిఆర్ఎస్ కండువా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశాఖ ఉక్కును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమ్మినా...బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకొని ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కారుచౌకగా అమ్ముతోందని విమర్శించిన కెసిఆర్.. రూ.42లక్షల కోట్ల ఆస్తులున్న ఎల్ఐసిని ఎందుకు అమ్మాల్సి వచ్చిందని మోడీని ప్రశ్నించారు. ఎల్ఐసిని కూడా పరిరక్షిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల్ని మోడీ ప్రభుత్వం తెగనమ్మేస్తుంటే దేశంలో మేధావి వర్గం గుడ్లప్పగించి చూస్తుందన్నారు. బిజెపి దుర్మార్గాలను ఎదిరించి దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చి మహోజ్వల భారత్ నిర్మాణం కోసమే బిఆర్ఎస్ ఆవిర్భవించిందని కెసిఆర్ పేర్కొన్నారు. ఒక ప్రాంతం కోసమో లేక ఒక రాష్ట్రం కోసమో బిఆర్ఎస్ పుట్టలేదని, సువిశాల దేశ సామూహిక లక్ష్యం కోసం పనిచేస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కెసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. తోట చంద్రశేఖర్, రావెల కిషోర్ బాబు, చింతల పార్థసారథి, డిజె ప్రకాశ్, రమేశ్ నాయుడు, శ్రీనివాస నాయుడు, జెటి రమేశ్, తదితరులకు కెసిఆర్ పార్టీ కండువా మెడలోవేసి ఆహ్వానించారు.



రావెల కిషోర్ కు బిఆర్ఎస్ కండువా కప్పుతున్న కెసిఆర్

ఆంధ్రప్రదేశ్ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్‌ను నియమిస్తున్నట్లు కెసిఆర్ ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిఎక్కువ సాగుభూమి భారతదేశంలోనే ఉందని, అయినా ఇప్పటికీ మనం ఆహారధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వాల వైఫల్యం కారణంగానే దేశరాజధాని ఢిల్లీలో రైతులు ధర్నా చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇండియా బుద్ధి మంతుల దేశం.. ప్రయత్నం ప్రబలంగా ఉండి సమాచారం చేరవేస్తే దేశం స్పందిస్తుందని, ఇందిరాగాంధీ వంటి బలమైన నేతనే దేశం గిల్లిపారేసిందని కెసిఆర్ గుర్తుచేశారు.

దేశ రైతాంగానికి ఉచిత విద్యుత్..దళిత బంధు

బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో వెలుగు జిలుగుల భారత్ సాకారమవుతుందని అన్నారు. దేశంలో రైతులందరికీ ఉచిత విద్యుత్ ఇచ్చి తీరుతామని, దళితులందరికీ దళిత బంధు అమలు చేస్తామని కెసిఆర్ ప్రకటించారు. దేశంలోని ఆరున్నర లక్షల గ్రామాల్లో బిఆర్ఎస్ శాఖలు ఏర్పటు చేస్తామన్నారు. దేశంలోని 4163 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ ఉంటుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా తనతో టచ్‌లో ఉన్నారని కెసిఆర్ చెప్పారు. సిట్టింగులు కదా మీకేం ఇబ్బంది అంటే ఫిట్టింగ్ లేదని వారు చెబుతున్నారని చమత్కరించారు. సంక్రాంతి తర్వాత బిఆర్ఎస్ విస్తరణ జోరుగా ఉంటుందని ఎనిమిది రాష్ట్రాల్లో కమిటీల కూర్పు కూడా పూర్తయిందన్నారు.

చంద్రబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కందుకూరు, గుంటూరు ఘటనలకు బాధ్యుడైన చంద్రబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పబ్లిసిటి కోసం పుష్కరాలలో 29మందిని, కందుకూరులో ఎనిమిది మందిని, గుంటూరు ముగ్గురిని బలి తీసుకున్నారని ఆరోపించారు. గుంటూరులో కానుకలు ఇస్తామని మభ్యపెట్టి ఎక్కువమందిని రప్పించుకొని కానుకలు ఇవ్వకపోవడంతో తొక్కిసలాట జరిగిందని అన్నారు. ఈ ఘటనను పోలీసుల వైఫల్యంగా టిడిపి చెప్పి తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. పోలీసులు వున్నందునే ప్రమాదం తీవ్రత తగ్గిందని అన్నారు. తెలుగుదేశం ప్రచారం పిచ్చికి ఇంతమంది చనిపోతున్నా పవన్‌కల్యాణ్ మాట్లాడక పోవడం తగదని అన్నారు.

కనీస పశ్చాతాపం లేని చంద్రబాబు : మంత్రి జోగి రమేష్

గుంటూరులో కానుకలు ఇస్తామని పేదలను మభ్యపెట్టి 30వేల మందిని సమీకరించి కానుకలను ఇవ్వకపోవడంతో ఆందోళనతో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మృతి చెందితే కనీస పశ్చాతాపం చూపకుండా చంద్రబాబు హైదరాబాద్‌కు పారిపోయారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం ఆయన సిఎం కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రచారం, రాజకీయ లబ్ది కోసం ఎంతవరకైనా తెగిస్తారని ఈ సంఘటనలు నిరూపించాయని అన్నారు.

చంద్రబాబు నీచరాజకీయాలకు సామాన్యులు బలి : పేర్ని నాని

తన రాజకీయ ప్రయోజనాలకోసం సామాన్యులను బలితీసుకునే కార్యక్రమాలను చంద్రబాబు చేపడుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన రాజకీయాలకోసం ఎంతమందినైనా బలితీసుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. తెలుగుదేశం కార్యక్రమంగా నిర్వహించిన గుంటూరు సభతో తమకు సంబంధం లేదని చంద్రబాబు అనడం దివాళాకోరుతనమని చెప్పారు.

నేటి నుంచి 12 వరకు

విజయవాడలో నాబార్డ్ క్రాఫ్ట్ మేళా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ కళలను ప్రోత్సహించేందుకు నాబార్డు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యాన ఈ నెల 3నుంచి 12వరకు 5వ నాబార్డు క్రాఫ్ట్‌మేళా - 2023ను విజయవాడ మేరీ స్టెల్లా ఇండోర్ స్టేడియం, పంట కాలువ రోడ్డు, ఎన్‌టిఆర్ విగ్రహం సమీపంలో నిర్వహిస్తామని నాబార్డు ప్రాంతీయ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. క్రాఫ్ట్‌మేళాను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ప్రారంభిస్తారని తెలిపింది. 3న మధ్యాహ్నం 3.30 గంటలకు పొందూరు, వెంకటగిరి, మంగళగిరి, పోచంపల్లి, మహేశ్వరి, కలంకారి చేనేత వస్త్రాల అమ్మకాల కోసం ప్రదర్శనకు పెడుతున్నట్లు పేర్కొంది. కొండపల్లి, ఏటికొప్పాక, తిరుపతి చెక్క బొమ్మలు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, చత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి గాజు ఉత్పత్తులు, లెదర్ తోలుబొమ్మలు, జనపనార సంచులు, ఆభరణాలు, అలంకారానికి సంబంధించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు.

చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలి

- గుంటూరు బాధితులకు వాసిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లాప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శకత్వంలో గుంటూరులో కానుకల పంపిణీ జరిగిందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల తొక్కిసలాట సంఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, అనేకమంది గాయాలపాలవ్వడం విషాదకరమన్నారు. గుంటూరులో ఆదివారం జరిగిన ఘటనలో గాయపడి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ఈ ఘటనపై జిల్లా ఎస్‌పిని నివేదిక కోరామని చెప్పారు. ప్రభుత్వానికి జరిగిన వాస్తవాలను వివరిస్తామన్నారు. ఈ సంఘటనకు చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కేసు నమోదు చేయాలి : ఎస్‌పికి మేయర్ కావటి ఫిర్యాదు

ముగ్గురు మహిళల మృతి ఘటనకు బాధ్యులుగా టిడిపి అధినేత చంద్రబాబుపై కేసు నమోదు చేయాలని గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు నేతృత్వంలో వైసిపి నాయకులు జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. టిడిపి నాయకులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని ఈ వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్‌పికి ఫిర్యాదు చేసిన వారిలో మేయర్‌తో పాటు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ఉన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న వాసిరెడ్డి పద్మ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

బాధితులకు మంత్రి యోగి రమేష్ పరామర్శ

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి యోగి రమేష్, ఎమ్మెల్సీ ఎల్ అప్పిరెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ చంద్రబాబు తీరును ఎన్నారైలు గ్రహించాలన్నారు.

ప్రభుత్వ వైఫల్యమే : నక్కా ఆనంద్ బాబు

జనతా వస్త్రాల పంపిణీలో ప్రభుత్వం, పోలీసుల భద్రతా వైఫల్యం వల్లే తొక్కిసలాట చోటుకుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆరోపించారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలకు ఆయన నివాళులర్పించి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రవాస భారతీయులు పేదల కోసం వినూత్నమైన కార్యక్రమం చేపట్టారని, ఈ కార్యక్రమంపై అక్కసుతో తాడేపల్లిలో స్క్రిప్ట్ మొత్తం ముందస్తుగానే తయారుచేసి పెట్టారని విమర్శించారు. ఈ ఘటనపై తొలుత 174 సెక్షన్ పెట్టి, తెల్లారేసరికి 304 సెక్షన్‌గా మార్చారని విమర్శించారు. కందుకూరు, గుంటూరు ఘటనలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు.

హరిరామయ్య దీక్షపై ప్రభుత్వం స్పందించాలి

- పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాపు సంక్షేమసేన వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య కాపు రిజర్వేషన్ల కోసం చేస్తున్న నిరవధిక దీక్షపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హరిరామ జోగయ్యకు పవన్‌కల్యాణ్ ఫోన్ చేసి పరామర్శించారు.

యువశక్తి వాల్ పోస్టర్ ఆవిష్కరణ

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈనెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యువశక్తి పేరుతో ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం యువశక్తి కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ యువత తమ ఆలోచనల గురించి వారి కష్టాల గురించి, భవిష్యత్తు గురించి గళం వినిపించేలా యువశక్తి కార్యక్రమం ఉంటుందన్నారు. గుంటూరులో జరిగిన తొక్కిసలాట దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు.

జోగయ్య దీక్ష విరమణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్ (ఏలూరు జిల్లా)

కాపు రిజర్వేషన్ల సాధన కోసం దీక్ష చేపట్టిన కాపు నేత చేగొండ హరిరామజోగయ్య సోమవారం దీక్షను విరమించారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం ఆయనను పోలీసు వాహనంలో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని ఆయన స్వగృహానికి తరలించారు.

అగ్రవర్ణాలకు కేటాయించిన పది శాతం ఇడబ్ల్యుఎస్ కోటాలో ఐదు శాతం కాపులకివ్వాలని డిమాండ్ చేస్తూ జోగయ్య ఆదివారం ఆమరణ దీక్షకు దిగారు. ముందుగా పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో దీక్ష చేపట్టాలనుకున్నారు. కానీ పోలీసులు అనుతివ్వకపోవడంతో ఆయన తన నివాసంలోనే దీక్ష చేయాలని భావించారు. పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి రవిప్రకాష్‌తో పాటు, ఇతర అధికారులు ఆయనతో చర్చలు జరిపారు. దీక్ష నిర్ణయాన్ని విరమించుకోవడానికి జోగయ్య ససేమిరా అన్నారు. పైగా తనను పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారని ప్రకటించారు. అప్పటికింకా భోజనం చేయకపోవడంతో, అప్పటికప్పుడే తాను ఉన్న కుర్చీలోనే దీక్ష ప్రారంభించినట్లు స్పష్టంచేశారు. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో జోగయ్యను పోలీసులు ఏలూరు జిల్లాకేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడా దీక్షను కొనసాగించడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పరీక్షలు చేసి, సెలైన్ ఎక్కించేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కాపు నేతలు ఆస్పత్రికి వచ్చి జోగయ్యను పరామర్శించేందుకు ప్రయత్నించినా పోలీసులు లోనికి అనుమతించలేదు. జోగయ్య కుమారుడు సూర్యప్రకాష్‌ను మాత్రమే లోపలికి అనుమతించారు. తాము చెప్పినా తన తండ్రి దీక్ష విరమించరని, కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధికారులు ఎవరూ తమ డిమాండ్ల సాధనపై చర్చించలేదని తెలిపారు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల ఎస్‌పిలు రవిప్రకాష్, రాహుల్‌దేవ్‌శర్మ పర్యవేక్షణలో అదనపు ఎస్‌పి ఎస్ఇవి, ఏలూరు డిఎస్‌పి జివిఎస్ పైడేశ్వరరావు, దిశా డిఎస్‌పి కెవి సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. తీవ్ర ఉత్కంఠ నడుమ సోమవారం సాయంత్రం జోగయ్య దీక్షను విరమించారు. ప్రత్యేక వైద్యుల సమక్షంలో పటిష్టమైన బందోబస్తు మధ్య జోగయ్యను పాలకొల్లులోని ఆయన స్వగృహానికి తరలించారు.

పవన్ సూచన మేరకు దీక్ష విరమణ : మాజీ మంత్రి జోగయ్య

దీక్ష విరమణ అనంతరం ఆయన మాట్లాడుతూ తాను జనసేన అధినేత పవన్ కల్యాణ్ సలహా మేరకు దీక్షను విరమించానని తెలిపారు. కాపులకు రిజర్వేషన్ల కోసం హైకోర్టుకు వెళ్లి తేల్చుకుంటానని స్పష్టం చేశారు. తమ సామాజిక తరగతిలోని పేదలకు న్యాయం చేయాలనే ఆలోచనతో దీక్ష చేపట్టానని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా ఆలోచన చేసి అగ్రవర్ణ పేదలకు ఇచ్చే పది శాతంలో కాపులకు ఐదు శాతం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు మద్దతుగా వచ్చిన కాపు సంక్షేమ సేన నాయకులను పోలీసులు అన్యాయంగా అరెస్టులు చేశారని, వారిని విడుదల చేయాలన్నారు.

ఆధారాలివిగో..

'ఎంఎల్‌సి' ఎన్నికల్లో కొనసాగుతున్న బోగస్ ఓటర్లు

ప్రజాశక్తి - అమరావతి

తుది జాబితా ప్రకటించినా ఎంఎల్‌సి ఎన్నికల్లో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సోమవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో సిపిఎం, సిపిఐలు ఈ మేరకు ఆధారాలను సమర్పించాయి. మొదటి లిస్ట్‌లో ఉన్న బోగస్ ఓట్లను తొలగించకుండానే, ఎటువంటి వెరిఫికేషన్ పూర్తిగా చేయకుండా ఫైనల్ లిస్టులు విడుదల చేశారని ఆ పార్టీల నాయకులు సిఇఓ దృష్టికి తీసుకువచ్చారు.

వాటిలో కొన్ని : ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గంలో 86, 87,88 పోలింగ్ స్టేషన్లలో తుది జాబితా ప్రకటన తరువాత కూడా దాదాపు 32 బోగస్ ఓట్లు కొనసాగుతున్నాయి. 86వ పోలింగ్ స్టేషన్లో 331వ నెంబర్‌తో నమోదైన ఓటరు గోగుల యశోదకు నిబంధనల ప్రకారం ఉండాల్సిన మూడు సంవత్సరాల సర్వీసు లేదు. అయినా ఉపాధ్యాయ ఎన్నికల్లో ఓటు హక్కు ఇచ్చారు. వరికుంట గణేష్‌బాబు (169వ నెంబర్ ఓటరు) సర్వీసు సర్టిఫికేట్‌ను అసలు జతపరచలేదు. ఈ విషయంపై అభ్యంతరం తెలియజేసినా ఆయన ఓటు కొనసాగుతోంది. ఎం.మమత (ఓటరు నెం.1040) అనే ఓటరు పేరు, సర్వీసుసర్టిఫికేట్, ఫోటో కూడా ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా ఉన్నాయి. ముసాయిదా ఓటర్ల జాబితా తరువాత ఈ ఓటుపై కూడా అభ్యంతరం తెలిపారు. అయినా, ఆ ఓటు యథాతథంగా కొనసాగుతోంది. బి. సుధాకర్ (273) వేరొకరి సర్వీసు సర్టిఫికేట్‌తో ఓటరుగా నమోదయ్యారు. దీనిపైన అభ్యంతరం తెలిపినా ఫలితం కనిపించలేదు. డిఐఎస్ఇలో పేరు లేకపోయినా రహమ్‌తున్నిసా పఠాన్, అల్తాఫ్ అహ్మద్ షేక్‌లు ఓటర్లుగా కొనసాగుతున్నారు.

డి. శ్రీనివాసరావు (914) అనే ఓటరకు సర్విస్ సర్టిఫ్‌కేట్ లేకపోవడంతో పాటు ఎఐసిటిఇ కౌంటర్ సైన్ చేసిన జాబితాలోనూ ఆయన పేరులేదు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకోపోయినా, ఓటు మాత్రం కొనసాగుతోంది.



నాటికతో ఆకట్టుకున్న కళాకారులు

సఫ్దర్ హష్మీకి ఘన నివాళి

- సాగర తీరంలో ఆకట్టుకున్న కళారూపాలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రజా కళాకారుడు సఫ్దర్ హష్మీ 34వ వర్ధంతి కార్యక్రమం ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన విశాఖ ఆర్‌కె.బీచ్‌లో సోమవారం ఘనంగా జరిగింది. హష్మీ చిత్రపటానికి పిఎన్ఎం సీనియర్ నాయకులు అరుణ్‌జీ, జిల్లా కార్యదర్శి ఎం.చంటి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో చంటి మాట్లాడుతూ కార్మికులు, కర్షకుల పక్షాన ప్రజానాట్య మండలి ఎల్లవేళలా నిలుస్తూ హష్మీ బాటలో పయనిస్తోందన్నారు. పాటలు, నాటికలు, డ్యాన్సులు, కోలాటం వంటి కళారూపాలతో ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్టు తెలిపారు. అనంతరం పెందుర్తి డివిజన్ కళాకారులు 'బంగారం' వీధి నాటకం ప్రదర్శించారు.

స్టీల్‌ప్లాంట్ కళాకారులు అమ్మో ఒకటో తారీఖు నాటికతో ఆకట్టుకున్నారు. 'సిఐటియు జెండా ఎగిరింది రా' అన్న పాటకు ఆశా కార్యకర్తలు కోలాటం ప్రదర్శించారు. జగదాంబ జోన్‌కు చెందిన బాలబాలికలు ఆజాదీ ఆజాదీ డ్యాన్స్‌తో జోష్ నింపారు. హష్మీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని కళాకారులంతా ప్రతినబూనారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, మౌలాలి, వై.అప్పారావు, ఎన్‌వి.రమణ, కృష్ణార్జున, లెనిన్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నోట్లరద్దును తప్పుబట్టలేం

మొదటి పేజీ తరువాయి

అధికారం లేదని, ఇది అన్ని రకాల బ్యాంకు నోట్లకు సంబంధించినదని అన్నారు. అందువల్ల నోట్లరద్దు నోటిఫికేషన్ చెల్లుబాటు అవుతుందని, నోట్ల మార్పిడికి 52 రోజుల వ్యవధి అసమంజసమని చెప్పలేమని పేర్కొన్నారు. ఆర్‌బిఐతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరిపి ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 26(2) కింద నోట్ల రద్దును తీసుకురావచ్చని అన్నారు. నోట్ల రద్దు లక్ష్యాలు నెరవేరాయా? లేదా? అన్నది ముఖ్యం కాదని పేర్కొన్నారు.

చట్టవిరుద్ధం : జస్టిస్ బివి నాగరత్న

నోట్లరద్దు చర్య, నోటిఫికేషన్ చట్ట విరుద్ధమని జస్టిస్ బివి నాగరత్న అన్నారు. ధర్మాసనంలోని మిగిలిన నలుగురు సభ్యుల అభిప్రాయాలతో ఆమె విభేదించారు. ప్రతి ప్రశ్నకు సమాధానాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ భిన్నమైన అసమ్మతి తీర్పును వెలువరించారు. నోట్లరద్దు అంశంలో రిజర్వ్ బ్యాంక్ తగిన శ్రద్ధ చూపలేదని జస్టిస్ నాగరత్న విమర్శించారు. కేవలం 24 గంటల్లోనే కసరత్తును ముగించారని, దీన్ని ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 26(2) ప్రకారం సిఫార్సుగా భావించలేమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పంపిన నోట్ల రద్దు ప్రతిపాదనను పరిశీలిస్తున్నప్పుడు ఆర్‌బిఐ దృష్టిలో ఎటువంటి దరఖాస్తు లేదని, ఆర్‌బిఐ సమర్పించిన రికార్డులను పరిశీలిస్తే నోట్ల రద్దును కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేసిందని గుర్తించబడిందని పేర్కొన్నారు. "నోట్ల రద్దుకు సంబంధించిన ఆర్‌బిఐ పత్రాల్లో "కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం" అని ఉంది. ఆర్‌బిఐకి ఎటువంటి స్వతంత్ర ఆలోచన లేదని చూపిస్తుంది. రిజర్వ్ బ్యాంక్ చట్టం ప్రకారం ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డు స్వతంత్రంగా నోట్ల రద్దును సిఫారసు చేసి ఉండాలి. ఇది ప్రభుత్వం సూచనల ప్రకారం అమలు జరపకూడదు" అని తెలిపారు. ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డ్ అభిప్రాయం స్పష్టంగా, స్వతంత్రంగా ఉండాలని, జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నోట్ల రద్దు లక్ష్యాలు ఏమైనప్పటికీ, దానిని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఏదైనా ఒక సిరీస్‌ని రద్దు చేయడం కంటే రూ.500, రూ.1,000 నోట్ల అన్ని సిరీస్‌లను రద్దు చేయడం చాలా ముఖ్యమైన దశ అని పేర్కొన్నారు. కేవలం గెజిట్ నోటిఫికేషన్‌తో అది సాధ్యం కాదని, గోప్యత పాటించాలన్నా, ప్రభుత్వం ఆర్డినెన్స్‌లు జారీ చేసి ఉండాలి, చట్టాలను ఆమోదించి ఉండాలని అన్నారు. ఆ తర్వాత రూ.2,000 నోటు కూడా విడుదలైంది కాబట్టి, నోట్ల రద్దు ద్వారా కేంద్ర ప్రభుత్వం సాధించాలనుకున్న లక్ష్యం ఏ మాత్రం సాధించలేకపోయిందని పేర్కొన్నారు. "దేశ ఆర్థిక వ్యవస్థకు ఆర్‌బిఐ రక్షణ కవచం. నేను ప్రపంచ వ్యాప్తంగా పెద్ద నోట్ల రద్దు చేసిన చరిత్రను ఉదహరించాను. ఆర్థిక లేదా ఆర్థిక నిర్ణయాల మెరిట్‌పై కోర్టు కూర్చోవడం కాదు. సెక్షన్ 26(2)ని పరిశీలించడం అంటే కూర్చోవడం కాదు. నోట్లరద్దు మెరిట్‌ల గురించి ఈ కోర్టు గీసిన లక్ష్మణ రేఖలో బాగానే ఉంది" అని అన్నారు. "కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నోట్ల రద్దు అనేది బ్యాంకులు చేసే దానికంటే పౌరులను ప్రభావితం చేసే చాలా తీవ్రమైన సమస్య" అని పేర్కొన్నారు. "పార్లమెంట్ లేకుండా ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందదు.. అటువంటి ముఖ్యమైన నిర్ణయాలకు పార్లమెంటు దూరంగా ఉండదు" అని ఆమె పేర్కొన్నారు.

పెద్ద నోట్ల రద్దును సుప్రీం సమర్థించిందని భావించలేం !

మొదటి పేజీ తరువాయి

82మంది తమ ప్రాణాలు కోల్పోయారని వార్తలందాయి. పైగా, నల్ల ధనాన్ని వెలికి తీయడం, విదేశీ బ్యాంక్‌ల నుండి ఆ మొత్తాలను వెనక్కి రప్పించడం, నకిలీ కరెన్సీ సమస్యను తుదముట్టించడం, తీవ్రవాదానికి నిధులు అందకుండా చేయడం, అవినీతిని నిర్మూలించడం, ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణిని తగ్గించడమన్నవి ఈ వినాశకర నిర్ణయాన్ని సమర్థిస్తూ పేర్కొన్న లక్ష్యాలని, కానీ వాటిల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ప్రజల్లో చలామణిలో వున్న కరెన్సీ, పెద్ద నోట్ల రద్దు సందర్భంగా రూ.17.7లక్షల కోట్ల నుండి ఇప్పుడు రూ.30.88 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్‌బిఐ పేర్కొంది. అంటే 71.84శాతం పెంపు నమోదైంది.

సుప్రీం కోర్టు ఇచ్చిన మెజారిటీ తీర్పు, ఇటువంటి నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి గల హక్కును మాత్రమే సమర్థించింది, అంతేకానీ ఇటువంటి నిర్ణయం తీసుకోవడం వల్ల తలెత్తే పర్యవసానాలను ఏ రకంగానూ సమర్థించలేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది.



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న కేరళ మంత్రి రాజీవ్, సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, జాతీయ, రాష్ట్ర నాయకులు

సిఐటియు నాయకులపై నిర్బంధం

- మహాసభకు వెళ్లవద్దని హౌస్ అరెస్టు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు వెళ్లనీయకుండా సిఐటియు తూర్పుగోదావరి జిల్లా నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, కార్యదర్శి కె.బేబిరాణి, కోరుకొండ మండల నాయకులు అన్నపూర్ణతో పాటు పలు చోట్ల సిఐటియు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల నాయకులను నిర్బంధించారు. ఆదివారం రాత్రంతా నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు కాపలా కాశారు. నిర్బంధించడం తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రాజులోవ అన్నారు. ఎందుకు నిర్బంధిస్తున్నారో నోటీసులిమ్మని అడిగితే పోలీసులు స్పందించలేదని తెలిపారు.

ప్రమాదంలో లౌకికతత్వం

- హిందుత్వ ఎజెండాతో బిజెపి, ఆర్ఎస్ఎస్ ఉన్మాద చర్యలు
- హిందీని బలవంతంగా రుద్దాలని చూడడం దారుణం
- కేరళలో నాణ్యమైన విద్య, ఆరోగ్యం
- సిఐటియు బహిరంగ సభలో కేరళ మంత్రి పి.రాజీవ్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

దేశంలో అనేక భాషలు, రకరకాల ఆహారపు అలవాట్లు, అనేక విధాలుగా వస్త్రధారణ పద్ధతులు ఉన్నప్పటికీ అంతా కలిసిమెలిసి జీవిస్తుండడం ఒక ప్రత్యేకతగా ఉందని, అలాంటి లౌకికతత్వానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ రూపంలో ప్రమాదం ఏర్పడుతుందని కేరళ న్యాయ, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ తెలిపారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా సోమవారం సాయంత్రం భీమవరంలోని కేశవరావు హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. తొలుత పాత బస్టాండ్ నుంచి జువ్వలపాలెం రోడ్డు, నటరాజ్ థియేటర్, వెంకటేశ్వరస్వామి గుడి, ఉండి రోడ్డు గుండా బొంబే స్వీట్స్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, పోలీసు బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ మీదుగా కొత్త బస్టాండ్ వరకూ వేలాది మంది కార్మికులతో మహాప్రదర్శన సాగింది. ఈ ప్రదర్శనలో జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు, వేలాది కార్మికులు పాల్గొన్నారు. సుభాని, సూర్యనారాయణ స్మారక ప్రాంగణం (కేశవరావు గ్రౌండ్)లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథి పి.రాజీవ్ మాట్లాడుతూ బానిసలుగా ఉంటామని బ్రిటిష్ వాళ్ల కాళ్లు పట్టుకుని బతిమాలినోళ్లు, స్వాతంత్య్ర పోరాటంతో సంబంధం లేనోళ్లు నేడు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. 1925లో ఏర్పడిన ఆర్ఎస్ఎస్... ప్రజాస్వామిక, లౌకిక దేశంగా ఉన్న భారత్‌ను హిందూ దేశంగా మార్చాలని చూస్తోందన్నారు. ఇది దేశానికి అత్యంత ప్రమాదమన్నారు. ప్రధాని సైతం హిందూ దేశంగా మార్చాలని చెబుతారని, అయితే రాజ్యాంగ కమిటీలో దీనిపై అప్పట్లో చర్చ జరిగిందని, చర్చల తర్వాత భారతదేశంగా రాజ్యాంగ సభ నిర్ణయించిందని గుర్తు చేశారు. అనేక భాషలు, మతాలు ఉండడంతో రాజ్యాంగంలో మనం అనే సంబోధన ఉండాలని నిర్ణయించారన్నారు. రాజ్యాంగంలో జాతీయ భాషగా హిందీ అని ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. దేశంలో అనేక భాషలను జనం మాట్లాడుతుంటే 22 భాషలు అధికారిక భాషలుగా ఉన్నాయన్నారు. ప్రాంతీయ భాషలు అని ఎక్కడా లేదని తెలిపారు. హిందీని బలవంతంగా రుద్దేందుకు చూస్తున్నారన్నారు. రాజ్యాంగంలోని క్రిమినల్ సివిల్ కోడ్‌ను సవరించి హిందూ, ముస్లిములకు ఒకే చట్టం అమలుకు పూనుకున్నారని విమర్శించారు. పౌరసత్వం మతాల ఆధారంగా లేదని, పాకిస్తాన్, బర్మా వంటి దేశాల నుంచి వస్తున్న వారికి పౌరసత్వం ఇవ్వకపోవడం రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని తెలిపారు. ఉదారవాద విధానాలు తెచ్చి దేశాన్ని నాశనం చేస్తున్నారన్నారు.



కార్మిక, ఉద్యోగ మహా ప్రదర్శన



సిఐటియు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్)

కేరళ మోడల్ ఇదే..

కేరళలో దఫదఫాలుగా వామపక్ష ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలు గెలిపించారని, 2021లో మాత్రం చరిత్ర తిరగరాశారని పి.రాజీవ్ పేర్కొన్నారు. భూపంపిణీ, నాణ్యమైన ఆరోగ్యం, విద్య వంటి విధానాలు కేరళలో అమలు చేశామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూళ్ల ఏర్పాటుతో పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్యం ఖరీదైందని తెలిపారు. కేరళలో గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం అందించడమే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో గుండెమార్పిడి, వైద్యకళాశాలల్లో అవయవ మార్పిడులు జరుగుతున్నాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యం అందుతోందని తెలిపారు. శిశు మరణాల్లో అమెరికాతో సమానంగా ఉన్నామన్నారు. ఇది కేరళ మోడల్ అని వివరించారు. ఇతర రంగాల్లోనూ కేరళ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 42 ప్రభుత్వ పరిశ్రమల్లో 22 లాభాల్లో ఉన్నాయన్నారు. మూతపడేస్తున్న కేంద్ర సంస్థలను సైతం రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూమి కొరత ఉందని, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కేరళలో ప్రతి ఏడాది ఒక ప్రభుత్వ పరిశ్రమ ప్రతిపాదించి అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ ప్రయివేటీకరణ పేరుతో కేంద్రం ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తోందన్నారు. నిరుద్యోగం 8.3 శాతానికి పెరిగిందని తెలిపారు. పన్నుల పెంపుతో ఈ ఏడాది జిఎస్‌టి రూ.1.5 లక్షల కోట్లు వచ్చిందన్నారు. అయినా, పేదలపై భారాలు మోపుతున్నారన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్, ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, బేబిరాణి తదితర నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఉపాధ్యక్షులు సాయిబాబు, నాయకులు మంతెన సీతారాం, ఆర్.లక్ష్మయ్య, వి.ఉమామహేశ్వరరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, డివైఎఫ్ఐ.ప్రసాద్, జెఎన్‌వి.గోపాలన్, బి.బలరాం, ఆర్.లింగరాజు, బి.వాసుదేవరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేశంలో మతతత్వ, కార్పొరేట్ పాలన

- శ్రామికులను విభజించేందుకు కుటిల యత్నాలు
- ఏప్రిల్ 5న ఢిల్లీలో పోరాటం కీలకం
- లేబర్‌కోడ్ అమలును ప్రతిఘటించాలి
- సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో తపన్‌సేన్



మహాసభలో మాట్లాడుతున్న తపన్‌సేన్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ప్రస్తుతం దేశంలో రాజకీయ పాలన సాగడం లేదని, మతతత్వ, కార్పొరేట్ పాలనలో ఉన్నామని, సమాజంలో ప్రతి అంగాన్నీ విషపూరితం చేసి, ప్రజల మధ్య విభజన సృష్టించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పేర్కొన్నారు. మూడు రోజులపాటు జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని టి.షడ్రక్, సావిత్రమ్మ నగర్ (అల్లూరి శ్రీరామరాజు కల్యాణ మండపం)లో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తొలుత సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ఆవిష్కరించారు. అనంతరం అమరువీరుల స్తూపానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులతోపాటు, హాజరైన ప్రతినిధులంతా నివాళులర్పించారు. ఆ తర్వాత ప్రారంభ సభలో ఏర్పాటు చేసిన అమరవీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సభకు హాజరైన నాయకులను సభా వేదికపైకి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ ఆహ్వానం పలకగా, బి.బలరాం ఆహ్వాన సంఘం అధ్యక్షోపన్యాసం చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు అధ్యక్షతన జరిగిన సభలో తపన్‌సేన్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఈ మహాసభ జరుగుతుందని, సంఘాన్ని మరింత శక్తివంతం చేసుకునే నిర్ణయాలు చేయాలని సూచించారు. కార్పొరేట్, కమ్యునల్, బడాపెట్టుబడి దారుల పాలనను తిప్పికొట్టే విధంగా ముందుకు సాగాల్సి ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం, ఆకలి సూచిక పెరుగుతోందని తెలిపారు. నయా ఉదారవాద విధానాలతో ప్రజల జీవనస్థాయి పడిపోతోందన్నారు. ప్రజాస్వామ్యం అర్థం మార్చేస్తున్నారని, పూర్తిగా కార్పొరేటర్ల లాభాల కోసం ప్రభుత్వాలు పని చేస్తున్నాయని విమర్శించారు.

ఇక్కడ వైసిపి ప్రభుత్వం నిరసనలు, ప్రదర్శనలను అణచివేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. వీటిని ఎదుర్కొంటూనే ప్రజాపంథాలో నడవాల్సి ఉందని తెలిపారు. హక్కుల కోసం పోరాడే సవాల్‌ను ఈ మహాసభ తీసుకోవాలని పిలుపునిచ్చారు. 2019లో లేబర్ కోడ్‌లు తెచ్చినా ప్రతిఘటనల కారణంగా ఇంకా అమలు చేయలేకపోయారన్నారు. పోరాటాల ఫలితంగానే 12 గంటల పని విధానాన్ని అమలు చేయలేకపోయారని తెలిపారు. జిందాల్ కంపెనీకి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అప్పగించాలని చూస్తున్నారన్నారు. కర్ణాటకలో రేల్వేను కట్టబెట్టడానికి చూస్తే అడ్డుకోగలిగామని తెలిపారు. నాయకులను ఇంట్లో నిర్బంధిస్తున్నా లక్షల సంఖ్యలో కార్మికులు బయటకు వస్తున్నారన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో దేశాన్ని నాశనం చేసేందుకు పూనుకున్నారని విమర్శించారు.

ప్రధాన సమస్యగా కాంట్రాక్ట్ వ్యవస్థ

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, క్యాజువల్ వర్కర్స్ సమస్య ప్రధానంగా ఉందని తపన్‌సేన్ తెలిపారు. పరిశ్రమల్లో ఏ విధంగా పని చేయాలి, పని గంటలు, వేతనాలు వంటి విధానాలు ఏమీ లేకుండా చేయాలని లేబర్ కోడ్‌లు తెచ్చారన్నారు. మనం విజయం సాధించకపోతే లేబర్ కోడ్‌లు విజయం సాధిస్తాయన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు మతాన్ని బట్టి కార్మికులను చూడవని, పాలకులే మతవిద్వేషాలు సృష్టిస్తున్నారని అన్నారు. వాస్తవాలను కిందిస్థాయిలోకి తీసుకెళ్లి కార్మికుల్లో చైతన్యం నింపాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ ఐదో తేదీన కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన ఢిల్లీలోని ఆందోళన పిలుపును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనిలో రాజకీయ కర్తవ్యం ఉందన్నారు. ప్రతినిధులనుద్దేశించి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఓబులేసు, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు సౌహార్ద్ర సందేశాలు ఇచ్చారు.

ఫేసియల్ హాజరు సగమే : యాప్ డౌన్‌లోడ్‌లో సమస్యలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో ప్రారంభమైన ఫేసియల్ హాజరు యాప్ అమలుకు బాలారిష్టాలు తప్పడం లేదు. జనవరి ఒకటి నుంచి అంతా యాప్ ద్వారానే హాజరు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా, ఒకటో తేదీ ఆదివారం కావడంతో రెండో తేదీ నుంచి అమలులోకి వచ్చింది. అయితే తొలి రోజు సగం మందికిపైగా సాధారణ హాజరు విధానాన్నే అనుసరించినట్లు తెలుస్తోంది. దీనికి అనేక కారణాలను కూడా అధికారులు చెబుతున్నారు. యాప్ డౌన్‌లోడ్‌పై ఇంకా సాంకేతిక సమస్యలు ఉన్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్నా కూడా హాజరు నమోదులో కొన్ని అడ్డంకులు నెలకొంటున్నాయని వారంటున్నారు. దీనిపై సిఎఫ్ఎస్ఎస్‌కు కూడా ఫిర్యాదులు వస్తుండడంతో వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల్లో పూర్తి స్థాయి అమలుకు ఆస్కారం ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇదే సమయంలో శాఖాధిపతులకు, కార్యదర్శులకు అందిన ఆదేశాలు దిగువస్థాయి సిబ్బందికి ఇంకా అధికారికంగా చేరలేదని సమాచారం. యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వారికి కూడా సిగ్నల్స్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. సచివాలయంలో ఉన్నప్పుడు మాత్రమే సిగ్నల్స్ అందుబాటులో ఉంటున్నాయని, అది కూడా హాజరు నమోదుకు సరిపడిన స్థాయిలో ఉండడం లేదని ఉద్యోగులు, అధికారులు అంటున్నారు. సాధారణ ఫోన్లు ఉపయోగించుకునే వారికి యాప్ డౌన్‌లోడ్ సాధ్యం కాదని, అందుకే యాప్ హాజరు నమోదు చేయలేకపోతున్నారని సమాచారం.

'ఉద్యోగులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకొని మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించాలని మద్య నిషేధ, అబ్కారీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ అన్నారు. వివిధ చట్టాలు, నిబంధనలు పట్ల పూర్తి అవగాహన కల్గి ఉన్న ఉద్యోగి త్వరితంగా ప్రజలు మన్ననలు పొందగలరని తెలిపారు. అబ్కారీ శాఖలో కారుణ్య నియామకం ద్వారా జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి పునశ్చరణ తరగతులను సోమవారం సచివాలయంలో ప్రారంభించారు. నవరత్నాలు, స్పందన వంటి కార్యక్రమాలు, చట్టాలు, నిబంధన పట్ల పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండాలని చెప్పారు.

సంపాదకీయం

నిరుద్యోగిత రికార్డులు

దేశంలో నిరుద్యోగిత రికార్డులు బద్దలు కొడుతున్న తీరు ఉపాధి రహిత జాతి నిర్మాణ దిశను తెలుపుతుంది. డిసెంబర్‌లో నిరుద్యోగిత పెరుగుదల రేటు 8.3 శాతానికి చేరుకుంది. గడచిన 16 మాసాల్లో ఇది గరిష్టం. పట్టణ నిరుద్యోగిత అంతకుముందు నెలలో 8.96 శాతం ఉండగా డిసెంబర్‌లో ఏకంగా 10.09 శాతానికి ఎగబాకింది. గ్రామాల్లో నిరుద్యోగిత 7.55 శాతం నుంచి 7.44 శాతానికి స్వల్పంగా తగ్గింది. అత్యధికంగా హర్యానాలో నిరుద్యోగిత 37.4 శాతానికి పెరిగింది. రాజస్థాన్ 28.5 శాతంతో రెండవ స్థానంలో, ఢిల్లీ 20.8 శాతంతో మూడవ స్థానంలో ఉంది. నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న సమయాన ఈ కఠోర వాస్తవాలను సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) బయటపెట్టింది. నిరుద్యోగిత విజృంభణపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేసిన ప్రతి సందర్భంలోనూ గిట్టని ఆరోపణలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం కొట్టి పారేస్తుంది. సిఎంఐఇ, ఐఎల్‌ఒ, నేషనల్ శాంపిల్ సర్వే, నేషనల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల నివేదికలపై ఏం సమాధానం చెబుతుంది? తామొస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని బిజెపి ప్రధాన మంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీ 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చిన ఈ ఎనిమిదిన్నరేళ్లలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పగలరా? కొత్త ఉద్యోగాల సంగతేమో సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల వలన పదుల లక్షల సంఖ్యలో ఉన్న ఉద్యోగాలు కోల్పోయిన దయనీయత నెలకొంది.

ఉద్యోగ, ఉపాధి, నిరుద్యోగిత తీరుతెన్నులు తప్పక ఆందోళన కలిగిస్తాయి. 2013లో ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య 44 కోట్లు కాగా 2021లో 38 కోట్లు. ఇదే సమయంలో పని చేయగలిగినవారి సంఖ్య 79 కోట్ల నుంచి 106 కోట్లకు పెరిగింది. 2013లో శ్రామిక శక్తిలో మహిళలు 36 శాతం ఉండగా 2021లో 9.24 శాతానికి దిగజారింది. కరోనా కంటే ముందు శ్రామికుల భాగస్వామ్యం 43 శాతం కాగా ఇప్పుడు 40 శాతానికి పడిపోయింది. ఈ గణాంకాలన్నీ నిరుద్యోగ భూతం ఎంతలా జడలు విప్పుతున్నదో విశదీకరిస్తాయి. మన దేశం స్థిరపర్చిన మానవాభివృద్ధి ప్రమాణాలనుబట్టి 15-29 సంవత్సరాల్లోపు వారిని యువతగా పరిగణిస్తారు. దేశ జనాభాలో వీరు 27.2 శాతం. దాదాపు 37 కోట్లకుపైమాటే. పట్టణాల్లో 9 కోట్ల మంది నిరుద్యోగులున్నారు. పట్టణ ప్రాంతాల్లోని యువతలో 23 శాతం మంది నిరుద్యోగులే. అటువంటి యువత ఉద్యోగ, ఉపాధిపై మోడీ ప్రభుత్వానికి లవలేశమాత్రమైనా దృష్టి లేదనడానికి ఈ లెక్కలు సరిపోతాయి. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, సన్ రైజ్ ఇండియా వంటి మోడీ ప్రభుత్వ నినాదాలు వాగాడంబరం, డంబాచారమేనని నిరూపితమైంది. ఉద్యోగాలడిగితే, వీధుల వెంబడి పకోడీలు అమ్ముకోవడమూ ఉద్యగమేనని యువతను హేళన చేసి మాట్లాడటం మోడీ, ఆయన మంత్రులకే చెల్లింది.


ప్రపంచం ఆర్థిక మాంద్యం అంచుకు చేరుతోందని ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒ, సహా పలు సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ప్రపంచ జిడిపి వృద్ధి 3 శాతం ఉంటే పెద్ద గొప్పంటున్నాయి. కానీ బిజెపి సర్కారు మాత్రం ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థకు ఎదుగుతామని గొప్పలు చెబుతోంది. ఇప్పటికే దేశంలో పారిశ్రామిక ప్రగతి ప్రతిష్టంభనలో కొనసాగుతోంది. పెట్టుబడుల్లేక ఉత్పాదక సామర్థ్యం తగ్గుతోంది. 2021 అక్టోబర్‌తో పోల్చితే 2022 అక్టోబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి రేటు 4 శాతం తక్కువగా ఉందని పారిశ్రామిక ఉత్పత్తి సూచి (ఐఐపి) వెల్లడించింది. తయారీరంగం వృద్ధి 5.4 శాతం పడిపోయింది. వినిమయ వస్తూత్పత్తి 15.3 శాతం, వినిమయేతర వస్తూత్పత్తి 13.4 శాతం క్షీణించింది. ప్రజల్లో కొనుగోలు శక్తి దిగజారుడుకు ఇది సంకేతం. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక మందగమనం, కరోనా ప్రభావం, అధిక ధరలు, ప్రభుత్వ విధానాలు నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. ఉపాధి హామీ విస్తరణ, మౌలిక వసతుల రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు కొంత వరకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు తోడ్పడతాయి. మోడీ ప్రభుత్వం భుజానికెత్తుకున్న నయా-ఉదారవాద విధానాలు ప్రభుత్వ పెట్టుబడులను అంగీకరించవు. యువత, నిరుద్యోగులు, ప్రజలు మోడీ ప్రభుత్వంతో తేల్చుకోవడమే మార్గం.

మంచి మాట



ఏ మనిషీ
తన గతాన్ని
తిరిగి కొనగలిగేంత
ధనవంతుడు కాదు.
- ఆస్కార్ వైల్డ్

వ్యవసాయ సంక్షోభం - సామ్రాజ్యవాదం



> ఇప్పుడు ప్రభుత్వం వెనక్కి తగ్గడం కేవలం తాత్కాలిక ఎత్తుగడ మాత్రమే. నయా ఉదారవాద విధానాల అమలుకు మోడీ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి వుంది. ఆహారధాన్యాల వ్యాపారంలో ప్రభుత్వం ఏ విధంగానూ జోక్యం చేసుకోకుండా ఉండడానికే ప్రయత్నిస్తోంది. ఆ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు సమర్పించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యం. అందుచేత అవకాశం చిక్కిన వెంటనే మళ్ళీ ఆ చట్టాలను ఏదో ఒక విధంగా ముందుకు తెస్తుంది. "దేశభక్తి" నినాదంతో సామ్రాజ్యవాదుల డిమాండ్లకు పూర్తిగా తలొగ్గడం మోడీ విధానం. అయితే ఆ విధానాలు దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తిని బాగా తగ్గించి వేస్తాయి. దాంతోబాటు ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా రద్దైపోతుంది. ఆహారధాన్యాలను విదేశాల నుండి దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చాక ఇక ప్రజా పంపిణీ వ్యవస్థ నడపడం అనేది సాధ్యపడే విషయం కాదు. ఆఫ్రికా దేశాల అనుభవాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

దక్షిణాది భూగోళంలోని వర్ధమాన దేశాల్లో ఉత్పన్నమయ్యే వ్యవసాయ సంక్షోభానికి సామ్రాజ్యవాదపు ఆధిపత్యంతో అనివార్యమైన లింకు ఉంది. ఇంకోవిధంగా చెప్పాలంటే, ఇక్కడ తలెత్తే వ్యవసాయ సంక్షోభం సామ్రాజ్యవాదపు ఆధిపత్యానికి మరో ముఖం మాత్రమే. మన దేశ వ్యవసాయ రంగాన్నే తీసుకుంటే ఇది స్పష్టంగా కనిపిస్తుంది. మన దేశం వలస పాలనలో మగ్గుతున్న కాలంలో వ్యవసాయ సంక్షోభం నిరంతరమూ కొనసాగుతూనే వుండేది. పదే పదే తలెత్తే కరువుల రూపంలో ఇది వ్యక్తం అయేది. 1765లో మొఘల్ చక్రవర్తి షా ఆలం నుండి బెంగాల్ ప్రాంతంలో భూమి శిస్తు వసూలు చేసే హక్కును ఈస్ట్ ఇండియా కంపెనీ కొనుక్కుంది. ఐదేళ్ళు తిరిగేసరికి, 1770 నాటికల్లా బెంగాల్ కరువులతో నాశనం అయిపోయింది. 1770 నాటి కరువులో కంపెనీ అధికారుల అంచనాలను బట్టే ఒక కోటి మంది బెంగాల్ ప్రజలు మరణించారు. అప్పటి బెంగాల్ మొత్తం జనాభాయే 3 కోట్లు! బహుశా ప్రపంచ చరిత్రలోనే ఇది అత్యంత భయంకరమైన కరువుగా పేర్కొనవచ్చు. బ్రిటిష్ వాళ్ళ పాలన ముగింపుకు వస్తున్న కాలంలో, 1943-44 నాటి బెంగాల్ కరువులో 30 లక్షల మందికి పైగా మరణించారు.

బ్రిటిష్ పాలన మొదలయ్యేటప్పటి కరువుకు కారణం కంపెనీ విధించిన అత్యధికమైన భూమి శిస్తు. మళ్ళీ బ్రిటిష్ పాలన ముగిసే ముందటి కరువుకు కూడా కారణం అప్పటి ప్రభుత్వం ప్రజల నుండి అత్యధికంగా వివిధరూపాల్లో వసూలు చేసిన పన్నులు, మోపిన భారాలు. విపరీతమైన లోటు బడ్జెట్ కారణంగా పెద్దఎత్తున తలెత్తిన ద్రవ్యోల్బణం ఒకవైపు, దక్షిణాసియాలో ఆనాడు మిత్ర రాజ్యాల కూటమి సాగిస్తున్న యుద్ధానికి కావలసిన నిధుల కోసం ప్రజల మీద మోపిన అదనపు భారాలు మరోవైపు ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేశాయి. ఇక కరువు అనేది ఎప్పుడొచ్చినా, దానికి ముందు బలి అయ్యేది గ్రామీణ పేదలే కదా. అందులో ముఖ్యంగా పేదరైతులు, వ్యవసాయ కూలీలు బలిపశువులౌతారు. ఈ కరువు భారాలతోబాటు, వలస పాలనలో రుణభారం, దారిద్ర్యం, ఉన్న భూములను కోల్పోవడం అనేవి పరిపాటి అయిపోయాయి.



ప్రభాత్ పట్నాయక్

ఈ విధమైన క్రూర పాలన వలస పాలకులకు యాదృచ్ఛికంగా సంక్రమించిన లక్షణం కాదు. బ్రిటన్ లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడానికి, ఇక్కడ సాగిన క్రూర దోపిడీకి లింకు ఉంది. ఇది బ్రిటన్ కే కాదు, తక్కిన సామ్రాజ్యవాద దేశాల విషయంలోనూ వర్తిస్తుంది. ఆ దేశాలలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందాలంటే అందుకు వివిధ రకాల ముడిసరుకులు, ఆహారధాన్యాలు అవసరం. అవి ఆ దేశాల భూముల్లో పండవు. కొన్ని రకాల పంటలను అక్కడ పండించినా, అవి అన్ని కాలాల్లోనూ అక్కడ పండవు, పండినా, ఆ పంటలు వాళ్ళ అవసరాలకు చాలవు.

ప్రపంచంలో మనకు తెలిసిన చమురు నిల్వలలో కేవలం 11 శాతం మాత్రమే శీతల దేశాల్లో ఉన్నాయి. కాని ఆ ప్రాంతమే ప్రపంచ పెట్టుబడికి కేంద్ర స్థానంగా ఉంది. ఆ విషయం గురించి మనం తరచూ మాట్లాడుకుంటాం. కాని ఆ దేశాలు వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తుల కోసం తక్కిన ప్రపంచం లోని ఉష్ణ, సమశీతోష్ణ ప్రాంతాల మీద ఆధారపడి వున్నాయన్న వాస్తవాన్ని పెద్దగా పట్టించుకోం.

18వ శతాబ్దం రెండో భాగంలోను, 19వ శతాబ్దం మొదటి భాగంలోను సంభవించిన పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధిపత్యం సాధించగలిగింది. అప్పుడు పరిశ్రమలకు కేంద్ర స్థానంలో జౌళి పరిశ్రమ ఉండేది. ఆనాటి పారిశ్రామిక విప్లవానికి మొనగాడుగా ఉండిన బ్రిటన్ లో అసలు పత్తి అనేది పండనే పండదు! ఉష్ణ, సమశీతోష్ణ ప్రదేశాల నుండి పత్తిని బ్రిటన్ దిగుమతి చేసుకోవలసి వచ్చేది. తమ దిగుమతి అవసరాలను ఆ ఉష్ణ, సమశీతోష్ణ ప్రాంతాలలోని దేశాలు తీర్చాలంటే ముందు ఆ దేశాల్లో వ్యవసాయంలో సరుకుల ఉత్పత్తి విధానాన్ని ప్రవేశపెట్టవలసిన అగత్యం బ్రిటన్ కు ఏర్పడింది. సరుకుల ఉత్పత్తి విధానం అంటే అన్నింటికన్నా ముందు మార్కెట్ సంకేతాలను బట్టి ఉత్పత్తికి సంబంధించిన నిర్ణయాలు జరగడం. స్థానికంగా ఆ యా దేశాల ఆహార లభ్యత, అక్కడి ప్రజల అవసరాలు అనేవాటితో ఈ నిర్ణయాలకు ఏ మాత్రమూ సంబంధం ఉండదు. ముందు మార్కెట్ కు అవసరమైన (సంపన్న దేశాలలోని పెట్టుబడిదారులకు అవసరమైన) సరుకుల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి, ఇంకా మిగిలిన భూభాగంలో మాత్రమే ఆ యా దేశాల స్థానిక అవసరాలను తీర్చే ఉత్పత్తులను (ఆహార ధాన్యాలను) పండించాలి.

వలస పాలనలో అమలు జరిపిన పన్నుల విధానంతో ఈ రెండు లక్ష్యాలనూ సామ్రాజ్యవాదులు సాధించుకోగలిగారు. అంతకు మునుపు మొఘల్ చక్రవర్తుల పాలనలో పండిన పంటలో ఒక భాగం పన్నుగా వసూలు చేసే పద్ధతి ఉండేది. డబ్బు రూపంలో చెల్లించాలన్న నిబంధన ఉండేది కాదు. ఆ తర్వాత వలస పాలనలో డబ్బు రూపంలో భూమిశిస్తు చెల్లించాలన్న నిబంధనను ఖచ్చితంగా అమలు చేశారు. దాంతో రైతులు వడ్డీ వ్యాపారుల నుండి రుణాలు తీసుకుని భూమి శిస్తు చెల్లించడం మొదలుపెట్టారు. ఆ వడ్డీ వ్యాపారులు రైతులకు రుణాలు ఇచ్చేటప్పుడే దానిని తిరిగి చెల్లించడానికి ఏ పంట పండించాలో ముందే షరతు పెట్టేవారు. ఆ పంటకు చెల్లించే రేటును కూడా ముందే నిర్ణయించేవారు. ఆ విధంగా వ్యవసాయంలో సరుకుల ఉత్పత్తి క్రమం ఈ దేశంలో ప్రవేశించింది. ఈ పని నేరుగా వలస పాలకులు చేయలేదు. వ్యాపారుల ద్వారా చేయించారు. ఆ వ్యాపారులు మార్కెట్ సంకేతాలకు అనుగుణంగా వ్యవహరించడం జరిగేది. అదే సమయంలో రైతుల మీద పన్నుల భారాన్ని విపరీతంగా పెంచారు. మరోవైపు పెట్టుబడిదారీ దేశాల నుండి యంత్రాల మీద తయారైన ఉత్పత్తులు పెద్దఎత్తున మన దేశంలోకి దిగుమతి కావడంతో ఇక్కడి స్థానిక వృత్తులన్నీ దెబ్బ తిన్నాయి. దేశీయ పరిశ్రమలు చితికిపోయాయి. దాని ప్రభావం వలన ప్రజల కొనుగోలుశక్తి బాగా క్షీణించింది. అందువలన ఇక్కడ సరుకులు అమ్ముడుపోవడం తగ్గిపోయింది. అప్పుడు సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు ఇక్కడి నుంచి కావలసిన ముడిసరుకులను కారుచవకగా పట్టుకుపోవడానికి మార్గం తేలికైపోయింది. ఆ విధంగా ఇక్కడ అనుసరించిన పన్నుల విధానం ద్వారా వలస పాలకులు తమ లక్ష్యాలను నెరవేర్చుకున్నారు.

వలసపాలన అంతం కావడంతో ఈ ఏర్పాటు కొనసాగడానికి వీలు లేకుండా పోయింది. దానికి తోడు కొత్తగా ఏర్పడిన స్వతంత్ర ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో పోషించిన పాత్ర ఇక్కడ చిరకాలంగా కొనసాగిన వ్యవసాయ సంక్షోభం బారి నుండి రైతాంగానికి ఊరట కల్పించింది. అయితే భూ కేంద్రీకరణ మాత్రం దాదాపు అదే విధంగా కొనసాగింది. ఇక్కడ భూస్వాములు చాలామంది పెట్టుబడిదారీ భూస్వాములుగా పరిణామం చెందారు (ప్రష్యా లోని భూకామందుల మాదిరిగా). రైతాంగం మీద సాగిన దోపిడీ మాత్రం కొనసాగింది. కాని వ్యవసాయ సంక్షోభ లక్షణాలైన నిరంతర కరువులు, నడ్డి విరిగే రుణ భారం, పట్టణాలకు వలసలు పోవడం, సామూహిక ఆత్మహత్యలు వంటివి ఆ కాలంలో ఆగిపోయాయి.

ఆ తర్వాత నయా ఉదారవాద విధానాల అమలు మొదలైంది. నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం అంటేనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని అంగీకరించి దానికి లోబడి వ్యవహరించడం. ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో భారత దేశపు పెట్టుబడిదారీ వర్గం సన్నిహితంగా కలిసిపోయి వ్యవహరిస్తోంది. దాంతో పరిస్థితులు మారిపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థ మీద సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల ఆధిపత్యం మళ్ళీ మొదలైంది. దాంతోబాటు వ్యవసాయ సంక్షోభమూ మొదలైంది. అయితే, ఈ మారు అది కరువుల రూపంలో రాలేదు. కాని రైతులు దివాలా ఎత్తడం, భరించలేని రుణభారం, దాని పర్యవసానంగా ఆత్మహత్యలకు పాల్పడడం, పట్టణాలకు వలసలు పెద్దఎత్తున పోవడం, వ్యవసాయం ఏ మాత్రమూ గిట్టుబాటు కాని వ్యాపకంగా దిగజారడం వంటి రూపాల్లో వచ్చింది. దానికి తోడు అత్యవసర సేవలైన విద్య, వైద్యం ప్రైవేటుపరం కావడం, ఆ సేవల ఖరీదు తలకు మించిన భారం కావడం రైతాంగానికి తలకు మించిన భారం అయిపోయింది.

స్వతంత్ర భారతదేశంలో తొలి దశాబ్దాలలో అమలు జరిగిన వ్యవసాయ విధానం నుండి ఈ విధమైన మార్పు జరగడం వెనుక కారణాలు ఏమిటి? చిన్న తరహా ఉత్పత్తి విధానంలోకి చొరబడడానికి, చిన్నరైతుల వ్యవసాయాన్ని చేజిక్కించుకోడానికి బడా పెట్టుబడి తహతహలాడుతూ వుంటుంది. నయా ఉదారవాద విధానాలు దాని వాంఛ నెరవేరే అవకాశాన్ని కల్పించాయి. ఇంకోపక్క సామ్రాజ్యవాదం మనదేశపు వ్యవసాయ రంగాన్ని తన సరుకుల ఉత్పత్తి చట్రం పరిధిలోకి మళ్ళీ లాక్కురావడానికి ప్రయత్నిస్తోంది. ఆ విధంగా మళ్ళీ జరిగితేనే సంపన్న దేశాల పెట్టుబడిదారుల అవసరాలు (ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు కారుచవుకగా మనవద్ద నుండి కాజేయడం) నెరవేరుతాయి. అది జరగాలంటే దేశీయంగా వాటికి ఉన్న డిమాండ్‌ను కుదించాలి. అందుకోసం విశాల ప్రజానీకపు కొనుగోలుశక్తిని కుదించివేయాలి. అందుకోసమే ఐఎంఎఫ్ ద్వారా పొదుపు చర్యల పేరుతో ప్రజా సంక్షేమానికి కోతలు విధించడం జరుగుతోంది. అయితే వలస పాలన కాలంలో వొట్టినే ఇక్కడి సరుకులను దోచుకుపోయినట్టు ఇప్పుడు పట్టుకుపోవడం సాధ్యం కాదు (అసమాన మారకపు రేట్లు, పేటెంట్ హక్కుల పేరుతో అదనంగా వసూలు చేయడం తదితర పద్ధతులతో దోచుకోవడం జరుగుతోంది). కాని ఆ సంపన్న పెట్టుబడిదారీ దేశాల అవసరాలకు సరిపడా సరుకులు ఇక్కడినుంచి లభ్యమౌతున్నాయి. పైగా ఈ అసమాన వ్యాపారం కారణంగా ద్రవ్యోల్బణం మీద ఏ ప్రభావమూ పడడంలేదు.

ఇక రెండో విషయం: తమ దేశాలలో ఏ సరుకులు అవసరమో వాటిని ఇక్కడ మన దేశాల్లో ఉత్పత్తి చేసే విధంగా నియంత్రించగలగడం. దాని వలన మన దేశపు ఆహార భద్రత లక్ష్యం దెబ్బ తింటోంది. గతానికి ఇప్పటికి ఇంకొక తేడా ఉంది. అప్పటితో పోల్చితే ఇప్పుడు సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఆహారధాన్యాల ఉత్పత్తిలో మిగులును సాధించాయి. వాటిని అమ్ముకోవాలంటే వర్ధమాన దేశాలలో ఆహార స్వయంసమృద్ధి అనేది ఉండకూడదు. అందుకే మన ప్రభుత్వాన్ని తన విధానాలను మార్చుకునేలా వత్తిడి చేస్తాయి. ఇప్పటికే వ్యాపార పంటల (కాఫీ, తేయాకు, రబ్బరు, పొగాకు వంటివి) విషయంలో కనీస మద్దతు ధర గ్యారంటీ చేయడం నుంచి ప్రభుత్వం వెనక్కి తప్పుకుంది. ఇప్పుడు ఆహార పంటల విషయంలో సైతం ధాన్య సేకరణ బాధ్యత నుండి, ప్రజా పంపిణీ నిర్వహణ బాధ్యత నుండి, కనీస మద్దతు ధరను గ్యారంటీ చేసే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకోవాల్సిందేనని ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి చేస్తోంది. అయితే ఆ దిశగా మన ప్రభుత్వం ధైర్యం చేయలేకపోతోంది. నిజానికి ఏ ప్రభుత్వమూ ఆ ధైర్యం చేయజాలదు.

అయితే మోడీ ప్రభుత్వం తన విచ్ఛిన్నకర హిందూత్వ ఎజెండాను ముందుకు తెచ్చి ప్రజల దృష్టిని పక్కకు మరల్చి ప్రపంచ వాణిజ్య సంస్థ వత్తిడికి అనుగుణంగా మార్పులు చేయడానికి పూనుకుంది. దానికి తోడు కరోనా మహమ్మారి ఆవరించడంతో తన పని తేలికగా అయిపోతుందని అనుకుంది. అందుకోసమే హడావుడిగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలనూ తీసుకొచ్చింది. ఆ చట్టాల ద్వారా ఆహార ధాన్యాలకు మద్దతు ధరను గ్యారంటీ చేసే విధానం రద్దు అయిపోయి వ్యవసాయ రంగ కార్పొరేటీకరణకు మార్గం సుగమం అయిపోతుందని తలిచింది. దాని కుట్రను కప్పిపుచ్చుడానికి ఈ చట్టాలు రైతుల సంక్షేమం కోసమేనంటూ ప్రచారం కూడా చేసింది. కాని ఈ దేశ రైతాంగం పట్టుదలగా సాగించిన పోరాటం మోడీ ప్రభుత్వ కుట్రలను సాగన్విలేదు.

ఇప్పుడు ప్రభుత్వం వెనక్కి తగ్గడం కేవలం తాత్కాలిక ఎత్తుగడ మాత్రమే. నయా ఉదారవాద విధానాల అమలుకు మోడీ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడివుంది. ఆహారధాన్యాల వ్యాపారంలో ప్రభుత్వం ఏ విధంగానూ జోక్యం చేసుకోకుండా ఉండడానికే ప్రయత్నిస్తోంది. ఆ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు సమర్పించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యం. అందుచేత అవకాశం చిక్కిన వెంటనే మళ్ళీ ఆ చట్టాలను ఏదో ఒక విధంగా ముందుకు తెస్తుంది. "దేశభక్తి" నినాదంతో సామ్రాజ్యవాదుల డిమాండ్లకు పూర్తిగా తలొగ్గడం మోడీ విధానం. అయితే ఆ విధానాలు దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తిని బాగా తగ్గించి వేస్తాయి. దాంతోబాటు ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా రద్దైపోతుంది. ఆహారధాన్యాలను విదేశాల నుండి దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చాక ఇక ప్రజా పంపిణీ వ్యవస్థ నడపడం అనేది సాధ్యపడే విషయం కాదు. ఆఫ్రికా దేశాల అనుభవాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఆ దేశాలలో ఆహార స్వయంసమృద్ధిని కోల్పోవడం వలన అక్కడ ప్రజా పంపిణీ వ్యవస్థలు మూలపడ్డాయి. ఆ దేశాలు ఆహార అవసరాలకోసం విదేశాల నుండి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధం వలన విదేశాల దిగుమతులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఆ దేశాలు కరువు ముంగిట నిలుచున్నాయి.

అందుచేత వ్యవసాయ సంక్షోభం నుండి బైట పడాలన్నా, ఆహార భద్రతను కాపాడుకోవాలన్నా, దేశ రైతాంగం సామ్రాజ్యవాదుల డిమాండ్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఎక్కుపెట్టక తప్పదు.

(స్వేచ్ఛానువాదం)

సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే

సందర్భం


ప్రపంచ వ్యాప్తంగా జాతి విముక్తి పోరాటాలు జరుగుతున్న రోజులవి. మన దేశం కూడా బ్రిటీష్ పరాయి పాలనలో ఉన్నప్పుడు ఎక్కడికక్కడ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆ కాలంలోనే అనేకమంది సంస్కరణల కోసం ప్రాణాలు అర్పించారు. భారత తొలి మహిళా ఉపాధ్యాయినిగా, సామాజిక వైతాళికురాలిగా...బాలికా విద్య కోసం, బడులు పెట్టడం కోసం సావిత్రీ బాయి పూలే చేసిన త్యాగాలు, కనబరచిన పట్టుదల మనందరికీ ఆదర్శనీయం.

విద్యా వ్యవస్థ పట్ల, విద్య సమాజానికి దారి చూపే తీరు పట్ల ఆమెకు ఎంతో స్పష్టత ఉంది. 1881లో లార్డ్ రిప్పన్, హంటర్ అధ్యక్షతన విద్యాకమిషన్‌ను నియమించేటప్పుడు మాతృభాషలో విద్య అందించాలని, శూద్ర, అతి శూద్ర కులాల వారికి పాఠశాలలు పెట్టాలని, పేదరికం వలన దిగువ కులాల పిల్లలకు 12 సంవత్సరాల వయసు వరకు ఉపకార వేతనం మంజూరు చేయాలని మహర్, మాంగ్ (గిరిజన తెగ) కులస్థులకు ప్రత్యేక పాఠశాలలు పెట్టాలని ప్రతిపాదనలు పెట్టారు పూలే.



కె.విజయగౌరి

ఆనాటి ప్రజల స్థితిగతులు, అవిద్య, సాంఘిక దురాచారాలు, సతీ సహగమనం, బాల్య వివాహాలు సావిత్రీబాయిని కదిపేశాయి. వీటిని నిర్మూలించడానికి అవసరమైన చైతన్యం పెరగాలంటే విద్య అందరికి అందుబాటులోకి రావాలని విశ్వసించారామె. బాలికల కోసం పాఠశాలలు ఏర్పాటు చేయడం మొదలెట్టారు. తద్వారా సమాజంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం కోసం కృషి చేశారు. తన దగ్గర చదువుకున్న పిల్లలు, పెద్దలు స్వేచ్ఛ కోసం స్వాతంత్ర్య పోరాటంలో ఉద్యమించారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో విద్యా వ్యాప్తికి చేపట్టిన పథకాలు పూర్తిస్థాయిలో అక్షరాస్యతను సాధించలేక పోయినా, విద్య బలోపేతానికి ప్రభుత్వమే బాధ్యత పడింది. కాని ప్రస్తుత సమాజంలో పూలే ఆశించిన లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారు.



నేడు సావిత్రీబాయి పూలే జయంతి

రెండు దశాబ్దాలుగా చేపడుతున్న విద్యా సంస్కరణలు వ్యాపార వర్గాలకు లాభాలు చేకూరుస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం (ఎన్ఇపి) అమలుతో పాఠశాలల మూత, క్లస్టరైజేషన్, మతతత్వ ధోరణులు సిలబస్‌లో జొప్పించడం, విద్యా హక్కు చట్టాలను నిర్వీర్యం చేయడం, రాష్ట్రాల విద్యాహక్కు చట్టాలపై పెత్తనం వంటి వాటికి పూనుకుంటున్నది. నేటి విద్యారంగ సంస్కరణలు బడుగు, బలహీన సామాజిక వర్గాల వారికి మరలా విద్యను దూరం చేసేవిగా ఉన్నాయి. మాతృభాషలో శూద్ర కులాల వారికి పాఠశాలలు పెట్టించిన పూలే ఆశయానికి భిన్నంగా నేడు పాఠశాలలు మూసివేస్తున్నారు. వెరసి బాలికలు పెద్ద సంఖ్యలో చదువుకు దూరం అవుతున్నారు.

అవిద్య, బాల్య వివాహాలపై పోరాటం, సతీ సహగమనం వంటి వాటిపై చైతన్య పరిచి, నిషేధించడం వంటివి సమాజానికి మేలు చేసిన సంఘటనలు. సామాజిక దురాచారాలను తిప్పి కొట్టాలంటే చదువే కీలకమని నిరూపించింది సావిత్రీబాయి పూలే. నేడు నూతన రూపాల్లో మతం, కులం, సంప్రదాయాల పేరుతో స్త్రీలపై, బాలికలపై జరుగుతున్న దాడులు చూస్తున్నాం. దుస్తులు, హిజాబ్, సంప్రదాయాలు, ఆహారం పరంగా ఆంక్షలను గమనించినట్లయితే ఇవన్నీ సమాజాన్ని మనువాదం లోకి తీసుకెళ్తున్నాయి. మరలా ఇటువంటి ఘటనలు ప్రజాస్వామ్య భారత దేశంలో పునరావృతం అవుతున్నాయంటే స్త్రీలకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేస్తున్నారనే అర్థం. పూలే స్ఫూర్తితో ఇటువంటి విధానాలపై పోరాటాలకు సిద్ధపడాలి.

సమకాలీన సమాజంలో సామాజిక అంతరాలను పెంచే విధానాలపై కళారూపాల ద్వారా చైతన్యపరచాలని, సాంస్కృతిక, జానపద అంశాలలో మహిళా టీచర్ల జోక్యం పెరగాలని, మూఢ విశ్వాసాలను పారదోలడానికి జానపదాలను ఎంచుకోవాలని, సాంఘిక దురాచారాలపై నిరంతరం పోరాడాలని ఆచరణలో చూపించారు సావిత్రీ బాయి పూలే. కాని ప్రస్తుత బిజెపి ప్రభుత్వ విధానాలు పాఠ్యపుస్తకాలలో మతతత్వాన్ని చొప్పిస్తున్నాయి. లౌకిక, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నాయి.

బాలికా విద్య కోసం, వర్ణ వ్యవస్థ నిర్మూలనకు, కుల మత తత్వాలకు వ్యతిరేకంగా సావిత్రీబాయి పోరాడారు. సమాన హక్కులు నినాదంతో అట్టడుగు వర్గాలవారికి బడులు పెట్టి విద్యనందించేందుకు కృషి చేశారు. స్వాతంత్ర్యం రాకమునుపు బ్రిటిష్ పాలకుల ఎజెండాలో, స్వాతంత్ర్యం వచ్చాక మన రాజ్యాంగంలో పైఅంశాలన్నింటికీ చట్టబద్ధత కల్పించాలని, సమ సమాజం స్థాపించాలని సావిత్రీ బాయి పూలే ఆశించారు. ఆ కృషి ఫలితమే నాటి సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బాలికల పాఠశాలలు. కాని నేటికీ విద్యాభివృద్ధికి కుల వ్యవస్థ ఆటంకంగానే ఉంది. కులతత్వాన్ని, మతతత్వాన్ని పెంచి పోషించే విధానాలను ప్రస్తుతం చూస్తున్నాము. ఇప్పటికీ బడుగు వర్గాల పిల్లలు చదువుకి దూరంగా ఉన్నారు. మొత్తం అక్షరాస్యతలో మహిళల అక్షరాస్యత 64 శాతం మాత్రమే. ఇటువంటి గణాంకాలు దేశ అభివృద్ధికి ఏ మాత్రం దోహదపడవు. విద్యకు దూరంగా ఉండే ప్రాంతాలు, వర్గాల వారు నిరంతరం దోపిడికి గురవుతారని అనేక అంశాలు సూచిస్తున్నాయి. బాల్య వివాహాలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, ఉపాధి, కార్మిక శక్తిలో 34 దేశాలతో పోల్చుకుంటే 24వ స్థానంలో ఉన్నాం. సరికొత్త సమస్యలు విద్యారంగంలో మొదలయ్యాయి. ఈ అవశేషాలను రూపుమాపాలంటే సావిత్రీబాయి సూచించిన సామాజిక ఉద్యమాలను నిర్మించాలి. అది మనందరి కర్తవ్యం.

స్త్రీలు చదువు నేర్చుకోవడమే అరుదైన కాలంలో బాలికలకు పాఠశాలలో విద్య నేర్పడానికి తన భార్య సావిత్రిని విద్యావంతురాలిని చేసి దేశానికి తొలి ఉపాధ్యాయురాలిని అందించారు జ్యోతిరావు పూలే. విద్యపై, ఉపాధ్యాయులపై, విద్యార్థులపై ఎంతో ప్రభావితం చేయగలిగిన ఆమె స్ఫూర్తిదాయక చరిత్ర మన దేశానికి ఎంతైనా అవసరం. సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వ పెద్దలు ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి సరిపెట్టుకుంటే సరిపోదు. ఆమె ఆశయాలకు కార్యరూపం ఇవ్వవలసిన బాధ్యత చేపట్టాలి. అలాగే ఆమె జయంతి రోజును జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి.

/ వ్యాసకర్త : యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
సెల్ : 8985383255 /

జనవాక్యం

ఓటు - నోటు

మత ప్రమేయం లేని లౌకిక రాజ్యంలో
మతమే రాజ్యమేలుతుంటే..
కుల రహిత సమాజ నిర్మాణంలో
కులానికే అగ్ర తాంబూలమిస్తుంటే..
పాఠాలకే తప్ప ప్రజలకు చేరువ కాక
ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుంటే..
ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఓటుని
పచ్చనోటుకి అమ్ముకుందామా...!
నోటుకు అమ్ముడు పోయి
మరో ఐదేళ్లు బానిసగా బతికేద్దామా..!
కుల మతాల చిచ్చు పెట్టి
వర్గ విభేధాలు సృష్టించి
ఆచరణలో వీలుకాని హామీలు గుప్పించి
యేరు దాటాక తెప్ప తగలేసే
ఈ రాజకీయ మహానుభావులకు
ఓటుతో ధీటుగా బదులిస్తూ
స్వచ్ఛ రాజకీయాలకు స్వాగతమంటూ
సరికొత్త స్వతంత్ర భారతావనిని
నిర్మిద్దామా..!

- కంది సత్యనారాయణమూర్తి
సెల్: 9030277529

మీ వ్యాసాలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

మతోన్మాదంపై కలిసికట్టుగా పోరాటం

- దేశ సేవక్ పత్రిక వ్యవస్థాపక దినోత్సవంలో తరిగామి


దేశ సేవక్ పత్రిక వ్యవస్థాపక దినోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న తరిగామి తదితరులు

చండీఘడ్ : మనందరం కలిసికట్టుగా ఆలోచిస్తూ, కలిసి జీవిస్తూ, కలలు గంటూ, మతోన్మాద, ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ యూసుఫ్ తరిగామి పిలుపునిచ్చారు. పంజాబ్ దినపత్రిక దేశ్ సేవక్ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని చండీగఢ్‌లోని బాబా సోహన్ సింగ్ భక్న భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 1920ల్లో జలంధర్ నుంచి వెలువడే ఆ పత్రిక, అనాటి బ్రిటిష్ ప్రభుత్వం నుండి ఒత్తిళ్లు ఎదురైనా తన వార్తలు, సంపాదకీయ విధానంలో ఎలాంటి రాజీ ధోరణి కనబరచలేదని తరిగామి ప్రశంసించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నాల్గవ ఎస్టేట్ అయిన పత్రికా రంగం తన అస్తిత్వాన్ని, అధికారాన్ని కోల్పోతోందంటూ విచారం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళుతున్న మీడియా గోడీ మీడియాగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సమాజంలో అణచివేతకు గురవుతున్న వర్గాల సమస్యలను నిర్భయంగా ప్రస్తావిస్తున్నందుకు ఆయన దేశ సేవక్‌ను అభినందించారు. జమ్ముకాశ్మీర్ పరిస్థితులపై వ్యాఖ్యానిస్తూ ఆయన, దేశంలోని ఇతర పౌరుల మాదిరిగానే మనమూ కూడానని, మనకు కూడా వారిలాగే కలలు, ఆకాంక్షలు వున్నాయని, మనకూ మంచి విద్య, వైద్యం, అన్నింటినీ మించి పరువు, మర్యాదలతో కూడిన జీవితం వుండాలని అన్నారు. భూప్ చంద్ చన్నో అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుఖ్విందర్‌సింగ్ షెకాన్, గురుదర్శన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజౌరిలో తీవ్రవాదుల దాడులు

- ఇద్దరు చిన్నారులుసహా ఆరుగురు మృతి

జమ్ము : జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో ఒక ప్రాంతంపై 14గంటల తేడాలో తీవ్రవాదులు రెండుసార్లు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు మైనర్లతో సహ ఆరుగురు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. డాంగ్రి గ్రామంలో ఆదివారం సాయంత్రం మూడు ఇళ్లపై తీవ్రవాదులు కాల్పులు జరపగా, నలుగురు పౌరులు మరణించగా, ఆరుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఆ తర్వాత అదే గ్రామంలో సోమవారం జరిగిన శక్తివంతమైన పేలుడులో అక్కా తమ్ముడు శాన్వి శర్మ (7), విహాన్ కుమార్ శర్మ (4) మరణించారు. ఈ సంఘటనలతో జిల్లావ్యాప్తంగా తీవ్ర నిరసనలు తలెత్తాయి. రాజౌరి పట్టణం పూర్తిగా సమ్మెతో స్తంభించింది. డిజిపి దిల్బాగ్ సింగ్ సంఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. తీవ్రవాదుల దాడిలో బాధితులను పరామర్శించడానికి సీనియర్ అధికారులు వస్తారని భావించి, వారిని లక్ష్యంగా చేసుకుని ఐఇడి పేలుడు జరిపారని డిజిపి తెలిపారు. పేలుడు సంఘటనపై దర్యాప్తు ప్రారంభమైందని చెప్పారు.

పట్టాలు తప్పిన ముంబయి-జోధ్‌పూర్ రైలు..

ముంబయి : ముంబయి-జోధ్‌పూర్ సోమవారం తెల్లవారుజామున రైలు పట్టాలు తప్పింది. రాజస్థాన్ లోని పాలి ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో 8 బోగీలు పట్టాలు తప్పాయి. నార్త్ వెస్ట్రన్ రైల్వే ప్రకారం ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరిగలేదని తెలిపింది. రైల్వే శాఖ జోధ్‌పూర్ నుంచి సహాయక రైలును పంపింది. ఈ ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఏపిలో నిరుద్యోగ రేటు 7.7 శాతం

- సిఎంఐఇ నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు 7.7 శాతం ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నివేదిక పేర్కొంది. గతనెల నవంబర్ కంటే డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు తగ్గిందని తెలిపింది. ఎపిలో నవంబర్‌లో 9 శాతం నిరుద్యోగ రేటు నమోదైందని పేర్కొంది. తెలంగాణలో కూడా నిరుద్యోగ రేటు తగ్గిందని తెలిపింది. డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు 4.1 శాతం నమోదైందని పేర్కొంది. గత పది నెలల్లో అత్యంత తక్కువగా నమోదైంది. నవంబర్‌లో 6 శాతం నమోదైన నిరుద్యోగ రేటు, డిసెంబర్ నాటికి 4.1 శాతానికి తగ్గింది.

సిఎంతో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార పార్టీలో ఉన్నా తమ సమస్యలేవీ పరిష్కారం కావడంలేదని, వృద్ధాప్య పింఛన్ల తొలగింపుపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్నం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎంని కలిసి తన నియోజకవర్గ సమస్యలను వివరించినట్లు తెలిసింది. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల పలువేధికలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా విమర్శలు చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో 2700 పింఛన్ల తొలగింపుపై మండిపడ్డారు. ఈ నేపథ్యంతోనే సిఎం ఎమ్మెల్యేను తాడేపల్లికి పిలిపించుకొని వివరణ కోరినట్లు తెలిసింది. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని సిఎంకు ఎమ్మెల్యే వివరించినట్లు తెలిసింది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో .

రాష్ట్రంలో అవినీతి రహిత, పారదర్శక పాలనను అందిస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వం పనిచేస్తోందని ఎపి స్టేట్ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి అన్నారు. సోమవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కాపు ఉద్యమ నేత ముద్రగడను, కాపు నేతలను అవమానించినప్పుడు ఇప్పుడు దీక్ష చేస్తున్న కాపునేత, వారి వెనుక ఉన్న నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. కాపు కులాలకు గత ప్రభుత్వంలో అన్యాయం జరుగుతున్నా ఒక్క మాట కూడా మాట్లాడని వారు.. ఇప్పుడు రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని ప్రతిపక్షాలతో కలిసి కుట్రలు చేస్తున్నారని అన్నారు.

ఆస్ట్రేలియాలో రెండు విమానాలు ఢీ.. నలుగురి మృతి

సిడ్నీ : రెండు హెలికాప్టర్లు గాలిలో ఒకదానినొకటి ఢీ కొన్నాయి. ఆస్ట్రేలియాలో సోమవారం జరిగిన ఈ ఘటనలో నలుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఆస్ట్రేలియాలోని దక్షిణ పోర్ట్‌లో ఈ ఘటన జరిగింది. ఓ హెలికాప్టర్ ఒడ్డుకు కొన్ని అడుగుల దూరంలో ఇసుకపై పల్టీలు కొట్టిందని, ఈ దృశ్యాలు మీడియాలో వైరల్ అయ్యాయి. మెరైన్ పార్క్ సమీపంలో మరో హెలికాప్టర్ ఉందని అధికారులు తెలిపారు. ఆ రెండు విమానాలు, ఢీ కొన్నప్పుడు క్రాష్ లాండ్ అయ్యి... సీ వరల్డ్ రిసార్ట్ ఇసుక ఒడ్డున ల్యాండ్ అయ్యాయి.



మహారాష్ట్రలో రెసిడెంట్ డాక్టర్ల సమ్మె

ముంబై : మహారాష్ట్ర ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని ఏడు వేల మందికిపైగా రెసిడెంట్ డాక్టర్లు సోమవారం సమ్మె చేశారు. హాస్టళ్లలో నాణ్యత లేమి, అసిస్టెంట్- అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీ వంటి సమస్యలపై మహారాష్ట్ర రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎంఆర్‌డి) ఇచ్చిన పిలుపుమేరకు వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు. మహారాష్ట్ర వైద్య విద్యాశాఖామంత్రి గిరిష్ మహాజన్ మీడియాతో మాట్లాడుతూ... 'వైద్యులు చేస్తున్న డిమాండ్లలో సగం వెంటనే ఆమోదిస్తున్నాం. హాస్టళ్ల మరమ్మతు పనుల కోసం ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి)కి రూ. 12 కోట్లు ఇచ్చాం.

మేము ప్రతిదానికి సానుకూలంగానే ఉన్నాం. రెసిడెంట్ వైద్యులతో చర్చలు జరుపుతున్నాం. ఈ విషయాన్ని పెద్దది చేయకండి' అని చెప్పారు. రాష్ట్రంలోని 1,432 సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల రిక్రూట్‌మెంట్ కోసం వైద్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అసోసియేట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

'ది వైర్' ఎడిటర్‌గా సీమా చిస్తీ



న్యూఢిల్లీ : సీనియర్ జర్నలిస్ట్ సీమా చిస్తీ 'ది వైర్' ఎడిటర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైర్‌కి చెందిన ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ వార్తాపత్రికలకు ఆమె ఎడిటర్‌గా వ్యవహరించనున్నారు. 'ది వైర్' వ్యవస్థాపకులు సిద్ధార్థ వరదరాజన్, ఎం.కె. వేణు, సిద్ధార్థ్ భాటియా సోమవారం ఈ మేరకు ప్రకటించారు. జర్నలిస్ట్‌గా అపారమైన జ్ఞాన సంపద, అనుభవంతో సీమా చిస్తీ సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిపోర్టర్‌గా, రచయితగా, పరిశోధకురాలిగా, విద్యావేత్తగా, బ్రాడ్‌కాస్టర్‌గా, దశాబ్దాల అనుభవం ఉన్న సీమా చిస్తీ ఎడిటర్‌గా ఈ బాధ్యతలు చేపట్టారు. 1990 సంస్కరణలు, బాబ్రీ మసీదు కూల్చివేతతో పాటు గత మూడేళ్లలో భారత్‌లోని అన్ని ప్రధాన సమస్యలపై పలు విస్తృత నివేదికలను వెలువరించారు. ముఖ్యంగా స్వతంత్ర రచయితగా పనిచేయడంతోపాటు ఆమె రాసిన వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ మీడియాల్లో ప్రసారమయ్యాయి. ఇండియన్ కేబుల్ వార్తా లేఖ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆమె... ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో 14 ఏళ్ల పాటు వివిధ విభాగాల్లో పనిచేశారు. ప్రముఖ వార్తా సంస్థ బిబిసికి కూడా తన సేవలందించారు. బిబిసి వరల్డ్ సర్వీస్‌కి చెందిన హిందీ, ఢిల్లీ బ్యూరో హెడ్‌గా, ఎడిటర్‌గా కొనసాగారు. చిస్తీ జెఎన్‌యు నుంచి మాస్టర్స్ డిగ్రీతో పాటు ఆర్థికవేత్తగా శిక్షణ పొందారు.

బ్రెజిల్ పునర్నిర్మాణానికి కృషి

నూతన అధ్యక్షుడు లూలా దసిల్వా హామీ



బ్రసీలియా : దేశాన్ని పునర్నిర్మించే ప్రణాళికలు చేపడతామని బ్రెజిల్ నూతన అధ్యక్షుడు లూలా డసిల్వా హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ సభ్యులను వారి వారి చర్యలకు జవాబుదారీగా చేస్తామని ప్రతిన చేశారు. ఆదివారం దేశాధ్యక్షులుగా ప్రమాణం చేసిన అనంతరం ఆయన కాంగ్రెస్ దిగువ సభలో ప్రసంగించారు. "ఆశ, పునర్నిర్మాణం ఇదే బ్రెజిల్‌కు మన సందేశం" అని ఆయన వ్యాఖ్యానించారు. "హక్కులు, సార్వభౌమాధికారం, అభివృద్ధి అనే పునాదులపై నిర్మించబడిన ఈ దేశమనే భవంతిని ఇటీవల సంవత్సరాల్లో వ్యవస్థాగతంగా దెబ్బతీశారు. తిరిగి ఆ భవనాన్ని పునర్నిర్మించేందుకు మనం అన్ని దిశలా మన కృషిని విస్తరించాలి." అని పేర్కొన్నారు. తుపాకీ నియంత్రణపై పట్టును తొలగించిన జేర్ బోల్సనారో ప్రభుత్వ నేరపూరితమైన డిక్రీలను రద్దు చేస్తానని ప్రకటించగానే వర్కర్స్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు. కోవిడ్ మహమ్మారి తలెత్తినా అదేం లేదంటూ తోసిపుచ్చి పరిస్థితి విషమించడానికి కారణమైన బోల్సనారో ప్రభుత్వాన్ని బాధ్యులను చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ పనితీరు తెలిసేలా ఒక నివేదికను ఎంపీలు, న్యాయాధికారులందరికీ పంపిస్తామని చెప్పారు. తమ వ్యక్తిగత, సైద్ధాంతిక ప్రయోజనాలకు దేశాన్ని తాకట్టు పెట్టాలనుకున్న వారిపై ఎలాంటి ప్రతీకారాన్ని తీర్చుకోబోమని హామీ ఇచ్చారు. చట్టబద్ధ పాలన తమ లక్ష్యమన్నారు.

డమాస్కస్ ఎయిర్‌పోర్టుపై ఇజ్రాయిల్ దాడులు

- ఇద్దరు సిరియా సైనికుల మృతి
- వెస్ట్‌బ్యాంక్‌లో ఇద్దరు పాలస్తీనియన్ల హత్య


వెస్ట్‌బ్యాంక్ పై దాడులు చేస్తున్న ఇజ్రాయిల్

రమల్లా : ఇజ్రాయిల్ క్షిపణుల దాడుల్లో ఇద్దరు సిరియా సైనికులు మరణించారు. డమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా దాడి జరగడంతో తాత్కాలికంగా సేవలు స్తంభించాయని సిరియా మిలటరీ తెలిపింది. సోమవారం తెల్లవారు జామున 2గంటల సమయంలో క్షిపణులు ప్రవాహంలా విమానాశ్రయంపై పడ్డాయని, ఫలితంగా ఇరువురు సైనికులు చనిపోగా, మరో ఇద్దరు గాయపడ్డారని తెలిపింది. కొద్ది గంటల అనంతరం విమానాశ్రయాన్ని తిరిగి తెరిచారని సిరియా అధికార వార్తా సంస్థ సానా తెలిపింది.

ఇద్దరు పాలస్తీనియన్ల హత్య

ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఉత్తర ప్రాంతంలో జెనిన్ నగర సమీపాన గల గ్రామంలో ఇజ్రాయిల్ సైన్యం దాడి చేసి ఇద్దరు పాలస్తీనియన్లను హత్య చేసింది. కుఫర్ డాన్ ప్రాంతంలో సోమవారం తెల్లవారు జామున మహ్మద్ సమీర్ (22), ఫహద్ మహ్మద్ అబెద్ (25)లను కాల్చి చంపినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దాడుల్లో మరో ముగ్గురు గాయపడ్డారని, వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా వుందని అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి ఇద్దరు పాలస్తీనియన్ల ఇళ్లను ధ్వంసం చేయడానికి ఇజ్రాయిల్ బలగాలు ప్రయత్నించడంతో ఘర్షణలు జరిగాయి. పేలుడు పదార్థాలు పెట్టి ఇళ్లను పేల్చివేయడం వీడియోల్లో కనిపిస్తోంది. ఆదివారం రాత్రి ప్రారంభమైన ఇజ్రాయిల్ మిలటరీ దాడులు సోమవారం ఉదయం వరకు కొనసాగాయి.

రాజధాని స్థలాల కేసులు త్రిసభ్య ధర్మాసనం ముందుకు

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి రాజధాని ఏరియాలో ఇతర ప్రాంతాల వాళ్లకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ చేసిన చట్ట సవరణను సవాల్ చేస్తూ దాఖలైన అన్ని కేసుల్ని తాము విచారణ చేస్తామని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ప్రకటించింది. దీనికి సంబంధించి కొన్ని కేసులు త్రిసభ్య ధర్మాసనం వద్ద ఉండగా, మరికొన్ని ద్విసభ్య ధర్మాసనం వద్ద ఉన్నాయి. వీటన్నింటినితామే విచారణ చేస్తామని చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ప్రకటించింది.

ఇదే విధంగా రాజధానిని 6 నెలల్లోగా అభివద్ధి చేయాలన్న ఉత్తర్వులను అమలు చేయకుండా కోర్టుధిక్కార చర్యలకు పాల్పడ్డారంటూ సిఎం , మంత్రులు, అధికారులపై దాఖలైన కేసులను కూడా కలిపి ఫిబ్రవరి 27న విచారణ చేస్తామని వెల్లడించింది. ఈ సందర్భంగా అమరావతి రాజధానిపై హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, సుప్రీంకోర్టులో ప్రభుత్వం వేసిన ఎస్ఎల్‌పీ విచారణలో ఉందని ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ చెప్పారు. అక్కడి కేసు పరిష్కారం అయ్యే వరకు తమ ముందున్న కేసుల్ని ఫిబ్రవరి 27కి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది.

నాసిక్ కెమికల్ ప్లాంట్లో బాయిలర్ పేలుడు

- ఒకరు మృతి : నలుగురి పరిస్థితి విషమం


ముంబయి: మహారాష్ట్రలోని నాసిక్‌లోని ఓ కెమికల్ ప్లాంట్లో బాయిలర్ బాంబులా పేలింది. ఈ ఘటనతో చుట్టుప్రక్కల ప్రజలు భయాందోళన చెందారు. ముండేగావ్ గ్రామంలోని జిందాల్ గ్రూప్ పోలిథిన్ తయారీ యూనిట్‌లో మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. మంటల్లో చిక్కుకుని ఒకరు మరణించారు. మరో 19మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రాథమికంగా సమాచారం తెలుస్తోంది. కెమికల్ ప్లాంట్ బాయిలర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి పెద్దఎత్తున పొగలు చుట్టుపక్కలకు వ్యాపించాయి. పలువురు ఫ్యాక్టరీలో చిక్కుకుపోవడంతో అధికారులు తక్షణ సహాయక చర్యలు చేపట్టారు.

మద్యం కుంభకోణంలో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయిన శరత్ చంద్రారెడ్డి, అభిషేక్ బోయినపల్లి, బినోయ్ బాబు, విజయ్ నాయర్లకు రౌస్ ఎవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టు మరో ఏడు రోజుల జ్యుడీషియల్ రిమాండ్ పొడిగించింది. మద్యం కుంభకోణంలో ఇడి, సిబిఐ అరెస్ట్ చేసిన ఈ నలుగురికి కోర్టు విధించిన జ్యుడీషియల్ రిమాండ్ సోమవారంతో ముగిసింది. దీంతో వారిని ఇడి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబిఐ ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకె నాగ్‌పాల్ ముందు హాజరుపరిచారు. ఇడి తరపు సీనియర్ అడ్వకేట్ నవీన్ కుమార్ మట్ట వాదనలు వినిపిస్తూ దర్యాప్తు కీలక దశకు చేరుకుందని, దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని, రిమాండ్ పొడిగించాలని కోరారు. దీంతో నలుగురు నిందితులకు మరో ఏడు రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించారు. తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా వేశారు.ఈ నెల 5న మనీ ల్యాండరింగ్ కేసులో అనుబంధ (సప్లిమెంటరీ) ఛార్జ్ షీట్ దాఖలు చేయనున్నట్లు ఇడి తరపు న్యాయవాది తెలిపారు. నిందితులపై విడివిడిగా కాకుండా అందరిపై ఒకే ఛార్జ్ షీట్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

టెక్సాస్ కౌంటీ జడ్జిగా ఇండో అమెరికన్ మాథ్యూ ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ : ఇండియన్-అమెరికన్ మహిళ, డెమొక్రాట్ అభ్యర్థి జూలీ ఎ. మాథ్యూ టెక్సాస్‌లోని ఫోర్ట్ బెండ్ కౌంటీ జడ్జిగా వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. కేరళలోని తిరువల్లాకు చెందిన మాథ్యూ కాసరగోడ్‌లోని భీమానడి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రమాణం స్వీకారం చేశారు. ఫోర్ట్ బెండ్ కౌంటీలో 3వ నెంబరు కోర్టుకు ప్రిసైడింగ్ జడ్జిగా నాలుగు సంవత్సరాలపాటు ఆమె కొనసాగుతారు డెమొక్రటిక్ పార్టీకి చెందిన జూలీ.ఈ పదవి కోసం ఎన్నికల్లో పోటీ చేసి తన సమీప రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ఆండ్రూ డోర్న్‌బర్గ్‌ను 1,23,116 ఓట్ల భారీ తేడాతో ఓడించారు. ఈ సందర్భంగా మాథ్యూ మాట్లాడుతూ, తనకు మద్దతుగా నిలిచిన వారికి, ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ మేరకు తన అధికారిక ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్ చేశారు. 2018లో రిపబ్లికన్ ట్రిసియా క్రెనెక్‌ను 8.24 శాతం ఓట్లతో ఓడించి.అమెరికన్ బెంచ్‌కు ఎన్నికైన తొలి ఇండో అమెరికన్ మహిళగా జూలి ఎ.మాథ్యూ చరిత్ర సృష్టించారు. సామూహిక హింసకు సంబంధించిన కేసుల్లో, సివిల్ లిటిగేషన్, క్రిమినల్ విషయాల్లో మాథ్యూకి పదిహేనేళ్లకు పైగా అనుభవం వుంది. ఫిలడెల్ఫియాలో పెరిగిన ఆమె.పెన్ స్టేట్ యూనివర్సిటీ, డెలావేర్ లా స్కూల్‌లో చదువుకున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యువతకు సహాయం చేయడానికి జూలీ .జువెనైల్ ఇంటర్వెన్షన్ అండ్ మెంటల్ హెల్త్ కోర్ట్‌ను స్థాపించారు. ఇక ఫోర్ట్ బెండ్‌లో మలయాళీలతో సహా భారతీయులు అధిక సంఖ్యలో స్థిరపడ్డారు. ఇక్కడ 28.6 శాతం మంది విదేశీయులు వుంటే వారిలో 51 శాతం మంది ఆసియా అమెరికన్లే.ఇకపోతే.మాథ్యూతో పాటు మరో ఇద్దరు డెమొక్రాట్లు జస్టిస్ కేపీ జార్జ్, సోనియా రాష్‌లు ఫోర్ట్ బెండ్ కౌంటీ నుంచి తిరిగి ఎన్నికయ్యారు.

కొత్త ఏడాది గడ్డు కాలమే

- మాంద్యంలోకి మూడోవంతు దేశాలు
- సంక్షోభం అంచున అమెరికా : ఐఎంఎఫ్ చీఫ్



న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాదిలో ప్రపంచంలోని మూడో వంతు దేశాలు ఆర్థిక మాద్యంలో చిక్కుకోనున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా హెచ్చరించారు. 2023లో మాంద్యం సంభవించనుందని విశ్లేషించారు. సిబిఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జార్జివా మాట్లాడుతూ.. "గత ఏడాదితో పోలిస్తే.. 2023లో మరింత గడ్డు పరిస్థితులు చోటు చేసుకోనున్నాయి. అమెరికా, యురోపియన్ దేశాలతో పాటు చైనా తదితర ఆర్థిక వ్యవస్థలు మందగిస్తున్నాయి. ఇప్పటికే ఉక్రెయిన్ యుద్ధం, అధిక ధరలు, వడ్డీ రేట్లు, చైనాలో మళ్లీ కరోనా లాంటి పరిస్థితులు అనేక దేశాల్ని ఇబ్బందిపెడుతున్నాయి. ఆర్థిక మాంద్యం లేని దేశాల్లో కూడా ఈ ఏడాది లక్షలాది మంది ఆ ప్రభావానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి." అని పేర్కొన్నారు. 10 నెలలు గడుస్తున్నా రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతుండడం, ద్రవ్యోల్బణం అధిక వడ్డీ రేట్లు, చైనాలో కరోనా కేసుల పెరుగుదల వంటి పరిస్థితుల నేపథ్యంలో జార్జివా ఈ వ్యాఖ్యలు చేశారు. "అమెరికా ఆర్థిక మాంద్యం అంచుల్లో ఉంది. ఇక యూరోప్ దేశాలు కూడా ఆ ప్రమాదం నుంచి గట్టెక్కడం అసాధ్యమే. మరికొన్ని నెలల పాటు చైనాలోనూ కఠిన పరిస్థితులు ఉండొచ్చు. అది చైనా వృద్ధి పైనా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పైనా ప్రతికూల ప్రభాన్ని చూపించనుంది." అని జార్జియా పేర్కొన్నారు. ఇటీవల అక్టోబర్‌లో ప్రపంచ వృద్ధి రేటు అంచనాలకు ఐఎంఎఫ్ కోత పెట్టింది. 2021లో 6 శాతంగా ఉన్న ప్రపంచ వృద్ధి రేటు 2022లో 3.2 శాతానికి పడిపోనుందని అంచనా వేసింది. 2023లో ఏకంగా 2.7 శాతానికి క్షీణించొచ్చని ఐఎంఎఫ్ విశ్లేషించింది. 2008 ఆర్థిక మాంద్యం, కరోనా పరిస్థితులను మినహాయిస్తే 2001 తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయిలో వద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి కానుందని ఐఎంఎఫ్ వెల్లడించింది. ఇప్పటికే అనేక ఆర్థిక వ్యవస్థలు హెచ్చు ద్రవ్యోల్బణంతో ఆర్థిక సంక్షోభ అంచుల్లో ఉన్నాయని అంతర్జతీయ ఏజెన్సీలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

అయ్యప్పను కేరళ సిపిఎం నేత అవమానించారంటూ ఇండియా టుడే ఛానల్ తప్పడు కథనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ వికారా బాద్ జిల్లా కొడంగల్ మండలం రావులపల్లిలో శబరిమల అయ్యప్పపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నాస్తిక సమాజం నేత బైరి నరేష్‌ని కేరళకు చెందిన సిపిఎం నేతగా ఇండియా టుడే న్యూస్ ఛానల్ ఫేక్ న్యూస్ ప్రసారం చేసింది. ఇంగ్లీష్ న్యూస్ బులెటిన్‌లో ప్రసారం చేసిన వీడియోను ట్వీట్ కూడా చేసింది. కేరళలో బైరి నరేష్ అనే సిపిఎం నాయకుడు లేడని, కేరళకు చెందిన సిపిఎం కార్యకర్తలతో పాటు పలువురు ట్విట్టర్‌లో స్పందించినా, వెంటనే సరిచేయలేదు. ఇంతలో బిజెపి అనుకూల సోషల్ మీడియా ఖాతాలతో ఈ అబద్ధం దేశవ్యాప్తంగా వ్యాపింప చేసింది. ట్వీట్ చాలా ఆలస్యంగా తొలగించినప్పటికీ, ఈ ఫేక్‌న్యూస్ ప్రసారంపై ఇండియా టుడే ఛానెల్ ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదు.

భారత్ శాంతి పక్షం !

- చర్చలతోనే సమస్యల పరిష్కారం : జై శంకర్

వియన్నా : ప్రస్తుతం సాగుతున్న ఉక్రెయిన్ ఘర్షణలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ శాంతి పక్షం వైపు వుందని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ వ్యాఖ్యానించారు. హింస ద్వారా విభేదాలను పరిష్కరించుకోలేనందు వల్ల, ఇరు పక్షాలు చర్చలు, దౌత్య పంథాను అనుసరించేలా భారత్ తొలి నుంచి కృషి చేస్తోందని చెప్పారు. రెండు దేశాల పర్యటనలో భాగంగా సైప్రస్ నుంచి వియన్నా చేరుకున్న జై శంకర్, అక్కడి భారతీయులను ఉద్దేశించి మాట్లాడారు. ఇది యుద్ధ శకం కాదని ప్రధాని మోడీ ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. గతంలో ఇరు పక్షాల నేతలతో మోడీ మాట్లాడారని, తాను కూడా ఆ రెండు దేశాలకు చెందిన తన సహచరులతో మాట్లాడానని చెప్పారు. ఇదేమీ అంత సులభంగా పరిష్కారమయ్యే పరిస్థితి కాదని మనకు తెలుసు, కానీ చర్చల పట్ల విశ్వాసమున్న దేశాలు ఆ దిశగా చర్యలు తీసుకోవడం మంచిదని అన్నారు. తమలాగే చాలా దేశాలు ఇదే రీతిలో ఆలోచిస్తున్నాయన్నారు.

సిఎం అబద్ధాల కోరు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలకోరు అని టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. అధికారంలోకి రావడానికి చెప్పిన అబద్ధాలే ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక కూడా చెప్తున్నారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్ల రూపాయల ప్రభుత్వసొమ్ముతో ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చే నాటికి 34లక్షల పెన్షన్లు రాష్ట్రంలో ఉంటే 2019 నాటికి చంద్రబాబు 54లక్షలకు పెంచారని తెలిపారు. తమ ప్రభుత్వం 54లక్షల పెన్షన్లు ఇవ్వలేదని నిరూపిస్తే తమ పార్టీ మూసేస్తామని, తన సవాల్ స్వీకరించే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా అని నిలదీశారు.

సిఎం శవ రాజకీయాలు : నిమ్మల

శవ రాజకీయంతో ముఖ్యమంత్రి అయిన జగన్ రాష్ట్రంలో శవ రాజకీయాలను కొనసాగిస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. కందుకూరు, గుంటూరులో ఘటనలను చంద్రబాబు చేసినట్టుగా చూపించి ఆయన సభలను బ్యాన్ చేయాలని కుట్ర జరుగుతోందని తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30వేల మంది పేదలకు కొత్తసంవత్సరంలో సాయం చేయాలనుకోవడమే ఎన్ఆర్ఐ ఉయ్యూరు శ్రీనివాసరావు చేసిన నేరమా అని మాజీఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రశ్నించారు. పోలీసులు సరైన భద్రత కల్పించనందునే గుంటూరులో అమాయకులు బలయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబు కార్యక్రమంలో ముగ్గురు మృతిచెందడం వెనుక అధికార పార్టీ స్లీపర్స్ సెల్స్ పాత్ర ఉందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు.




మీకోసం

రెండు లేదా మూడు వెల్లుల్లి రెమ్మలు చిదిమి ఒక స్పూన్ తేనెతో కలిపి తీసుకుంటే నులి పురుగుల సమస్య తగ్గుతుంది.

జీవన సౌరభం

చేసే ప్రతి యుద్ధంలోనూ గెలవలేము. కానీ ప్రతి యుద్ధంలోనూ పాఠాలూ, ఫలితాలూ ఉంటాయి.

తాతయ్య సైకిల్



మా తాతయ్య ఓ చిన్న పిల్లలు తొక్కుకునే మూడు చక్రాల సైకిల్ కొని తెచ్చాడు. అది చూసి ఇంట్లో అందరం ఆశ్చర్య పోయారు.ఎందుకంటే ఇంట్లో చిన్న పిల్లలు ఎవరూ లేరు.


"మనింట్లో చిన్న పిల్లలు ఎవరూ లేరు కదా తాతయ్య, మరి ఈ సైకిల్ ఎవరి కోసం తెచ్చావు?"

అడిగాడు తాతయ్య మనవడు ఇంటర్ చదివే సుధీర్.

తాతయ్య చిరునవ్వుతో చెప్పాడు,"సుధీర్ నీకు చిన్నప్పుడు సైకిల్ కొన్నాను,దాని నీవు తొక్కుకుని ఆడుకున్నావు అది పాడైపోతే పాత ఇనప సామాను కొనే వాడికి అమ్మేశాను...నిన్న మన పనిమనిషి మనవడు ఎవరో పిల్లాడు వీధిలో మూడు చక్రాల సైకిల్ తొక్కు తుంటే చూసి కొనిపెట్టమని ఏడ్చాడు. దాని కొచ్చే జీతంలోఅది ఎలా సైకిల్ కొనిపెట్టగలదు? నీకు తెలియదురా చిన్నప్పుడు నాకు సైకిల్ కొనిపెట్టమని మా నాన్నను అడిగితే అప్పట్లో తనకొచ్చే మూడొందల జీతంలో నాకు సైకిల్ కొనిపెట్ట లేక పోయాడు.పిల్లలకు సైకిల్ ముచ్చట ఎంతో ఉంటుంది.అది వాళ్ళకు దక్కక పోతే వాళ్ళు పడే బాధ నాకు తెలుసు.ఎందుకంటే ఆబాధ నేను అనుభవించాను కాబట్టి.

"సుధీర్ ఈరోజు నా పుట్టిన రోజు కదా ఈ సంధర్భాన పనిమనిషి కొడుక్కి ఈ సైకిల్ బహుమతిగా ఇస్తాను" చెప్పాడు తాతయ్య. ఆయన మంచి ఆలోచనకు,మంచి మనసుకు సుధీరే కాకుండా ఇంట్లో అందరూ చప్పట్లు కొట్టారు.

- కంచనపల్లి వేంకట కృష్ణారావు
93486 11445



దారి చూపండి

చిన్నారులూ, పెంగ్విన్‌కు ఆకలిగా ఉంది. లోపల ఉన్న చేపను చేరుకోవడానికి దారి చూపి సాయం చేయరూ!



నేను గీసిన బొమ్మ



కె. మలేహా, 8వ తరగతి, ఇంగ్లీష్ మీడియం, జెడ్పిహెచ్ఎస్, హవేలీ, ఘనపూర్, మెదక్.


పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చీకటి బతుకుల వెలుగు దివిటీలు..



అంజు వర్మ

'పంజరం నుంచి బయటపడ్డ పక్షి మరింత బలంగా పైకి ఎగురుతుంది'.. అంటున్న అంజు వర్మ, 'మురికికూపంలో పుట్టిన నా చుట్టూ ఎన్నో సవాళ్లు. వాటన్నింటినీ ఎదుర్కొనడం, బయటపడడమెలాగో నా వారికి నేర్పిస్తున్నాను' అంటున్న నసీమా ఖాటూన్, మానవ అక్రమ రవాణాకు గురైన నేను నాలా మరే ఆడపిల్ల ఆ కూపంలోకి పడనీయను' అంటున్న అనుయోరా ఖాటూన్ వేర్వేరు ప్రాంతాల మహిళలు. బీహార్, హర్యానా, పశ్చిమబెంగాల్‌కు చెందిన వీరంతా బాల్యవివాహాలను అరికట్టడం, అక్రమ రవాణను అడ్డగించడం, వేశ్యావాటికల పిల్లల బతుకులు బాగుచేయడంలో అలుపెరగని కృషి చేస్తున్నారు.



నసీమా ఖాటూన్

నసీమా ఖాటూన్

బీహార్ ముజఫర్‌పూర్ ఛతుర్భుజ్ స్థాన్ అనే రెడ్‌లైట్ ఏరియాలో పుట్టిపెరిగింది నసీమా ఖాటూన్. ఆ ప్రాంతంలో టీ కొట్టు నడుపుకునే ఆమె తండ్రిని బాల్యంలోనే దత్తత తీసుకుంది ఓ సెక్స్‌వర్కర్. అతన్ని పెంచి పెద్ద చేసిన ఆమే నసీమా ఆలనాపాలనా చూసేది. కానీ చిన్నప్పటి నుంచే నసీమా తన చుట్టూ ఉన్న వారికి భిన్నంగా ఆలోచించేది. చదువుకోవాలని, బయటకు వెళ్లాలని, ఈ బతుకులు బాగుచేయాలని కలలుగనేది. అలా 1995లో ఓ ఐఎఎస్ ఆఫీసర్ చొరవతో ఆ కూపం నుంచి బయటపడింది. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కుట్లు, అల్లికలు నేర్చుకుంటూ నెలకు రూ.500 సంపాదించేది. అక్కడే ఉన్నతవిద్యను అభ్యసించింది. అంతటితో తన కష్టాలు తీరాయని అనుకోలేదు. తనవారి కోసం తపించింది. తన కాళ్ల మీద నిలబడే సామర్థ్యం వచ్చాక 'పర్చమ్' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. దాని ద్వారా వేశ్యావాటిక మహిళలకు విద్య, ఉపాధి, హక్కులపై అవగాహన కల్పించేది. అక్కడి పిల్లల కోసం 'జుగ్ను' పేరుతో చేతితో రాసిన ఓ మాసపత్రికను నడిపేది. ఆమె తపన, కృషితో ఎంతోమంది తమ బతుకులు బాగుచేసుకుంటున్నారు. తన వారి బాగోగుల కోసం ఇంతలా తపిస్తున్న ఆమె ఇటీవల నవంబరు 2022లో మానవ హక్కుల కమిషన్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా నియమితురాలైంది. 'మా కమ్యూనిటీ నుంచి ఇప్పుడు చాలామంది తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. చాలామంది మహిళలు ఈ వృత్తిని వదిలి గౌరవప్రదంగా జీవించేందుకు వృత్తివిద్యా కోర్సుల వైపు మళ్లుతున్నారు. బీహార్‌లో 38 జిల్లాల్లో రెడ్‌లైట్ ఏరియాలున్నాయి. నేను అక్కడి బాలికల విద్య, ఉపాధి అవకాశాల కోసం పనిచేయాలనుకుంటున్నాను' అంటున్నారు నసీమా.



అనుయోరా

అంజు వర్మ

హర్యానా దౌలత్‌పూర్ గ్రామనివాసి అయిన అంజు వర్మ ట్రక్‌డ్రైవర్ కుమార్తె. చాలా పేద కుటుంబం. ఆ ప్రాంతంలో బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు, బాలకార్మికులు ఎక్కువ. తన కళ్ల ముందే ఎందరో ఆడపిల్లలు బాల్యవివాహాలకు బలౌతున్నారు. ఇంకొంతమంది పురిట్లోనే మరణిస్తున్నారు. వీటన్నింటి వెనుక బలమైన పితృస్వామ్య భావజాలం ఉందని ఆమె చిన్నవయసులోనే గ్రహించింది. ఎవరో వచ్చి తమ బతుకులు బాగుచేస్తారని కూర్చోవడం కన్నా తానే స్వయంగా ఎందుకు ప్రయత్నించకూడదనుకున్నది. అనుకున్నదే తడవుగా 2017లో 'బులాండ్ ఉడాన్' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థ స్థాపించింది. 'పంజరం వీడిన పక్షి' అర్థం వచ్చే ఆ సంస్థలో 70 మంది వాలంటీర్లను నియమించింది. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు, భ్రూణ హత్యల వల్ల కలిగే నష్టాలపై 190 గ్రామాల్లో సంస్థ తరపున కార్యకలాపాలు నిర్వహిస్తోంది. గ్రామస్తుల్లో వచ్చిన అవగాహనతో 700లకు పైగా పిల్లలు బడిబాట పట్టారు. 30 బాల్య వివాహాలు నిలుపదల చేయగలిగారు. భ్రూణ హత్యలను అడ్డుకుంటున్నారు. ఇన్ని మైలురాళ్లను సాధిస్తున్న అంజుకి సంస్థ స్థాపించేటప్పటికి 17 ఏళ్లే. అంత చిన్న వయసులోనే తన ప్రాంత బాగోగులు కోసం అవిశ్రాంత కృషి చేసింది ఆమె. 'మా ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు వస్తాయి. ఒక్కోసారి తలుపులన్నీ మూసుకుపోతాయి. అవి తెరుచుకునేంతవరకు మేము బద్దలుకొడుతూనే ఉంటాం' అని చెబుతారు.

అనోయారా ఖాటూన్

పశ్చిమబెంగాల్ సుందర్‌బాన్ ప్రాంతానికి చెందిన అనోయారా 12 ఏళ్లప్పుడు మానవ అక్రమ రవాణాకు గురైంది. గృహనిర్బంధంలో బానిసలా బతకాల్సివచ్చింది. కొంతకాలానికి ఓ స్వచ్ఛంద సంస్థ చొరవతో అక్కడి నుండి బయటపడింది. అయితే పంజరం నుండి బయటపడిన అనోయారా ఇంటికొచ్చినా తనలా ఎంతోమంది బాలికలు ఆ మురికికూపానికి బలైపోతున్నారని గ్రహించింది. బాలకార్మికులుగా, ఇతర రాష్ట్రాలకు తరలించబడి, వేశ్యావాటికల్లోనో.. బాల్య వివాహాలకో గురై దుర్భరంగా బతుకుతున్నారని తెలుసుకుంది. తాను పడిన కష్టం, మరే ఆడపిల్ల పడకూడదని నిశ్చయించుకుని తనను రక్షించిన సంస్థ ద్వారా వారందరికీ న్యాయం చేయాలనుకుంది. వారి సహకారంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేది. గ్రామాలు తిరుగుతూ స్వయంగా అనేక సమావేశాలు జరిపేది. ప్రత్యేకంగా పిల్లల సమూహాలను నెలకొల్పి ఎన్నో విషయాలను చర్చించేవారు. ఆ సమావేశాల్లో పెద్దలను కూడా భాగస్వామ్యం చేసేవారు. ఆమె ఇచ్చిన ఆత్మస్థైర్యంతో ఎంతోమంది బాధితులు అక్రమ రవాణా నుంచి బయటపడ్డారు. పెద్దల్లో వచ్చిన అవగాహన వల్ల బాల్యవివాహాలు తగ్గుముఖం పట్టాయి. అంతటితో ఆమె ప్రయాణం ముగియలేదు. ఎన్నో దేశ,విదేశ స్వచ్ఛంద సంస్థలతో పనిచేయడం మొదలుపెట్టారు. 2015లో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సమ్మిట్‌లో భారతదేశపు పిల్లల గొంతుకగా తన గళం వినిపించారు. అక్రమ రవాణాకు గురైన ఓ ఆడపిల్ల ఆ కూపం నుండి బయటపడి ఇంత ఎత్తుకు ఎదుగుతుందని ఎవరూ ఊహించలేదు. అందుకే ఆ ప్రాంతంలో ఆమె ఎప్పటికీ ఓ విజేతగా నిలిచిపోయారు.

నిర్బంధ సంకెళ్ల నుంచి బయటపడిన ఈ మహిళలు తాము అనుభవించిన బాధ మరెవ్వరూ పడకూడదని నిర్దేశించుకున్న లక్ష్యంలో నడుస్తున్న ఈ మార్గం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

మా చిరునామా

రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక , ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి



15 చుక్కలు 8 వచ్చేవరకు (మధ్య చుక్క)

ఎం. పవిత్ర, ఒంగోలు




15 చుక్కలు 8 వచ్చేవరకు (మధ్య చుక్క)

ఎయుఆర్ఎస్ సుభాషిణి, మండపేట, కోనసీమజిల్లా.





ఫిబ్రవరి 17న 'శాకుంతలం'



గుణశేఖర్ దర్శకత్వంలో సమంత ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'శాంకుతలం' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. ఎపిక్ మైథలాజికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ పాన్ ఇండియన్ సినిమా ఫిబ్రవరి 17, 2023న థియేటర్లలో విడుదల కాబోతుంది. ఈ చిత్రంలో దేవ్ మోహన్, మోహన్ బాబు, ప్రకాష్ రాజ్, గౌతమి, అదితి బాలన్, అనన్య నాగళ్ల ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని గుణ టీమ్‌వర్క్స్‌పై నీలిమ గుణ నిర్మించారు. 2డితో పాటు ఈ 3డి వెర్షన్‌లో కూడా ఈ చిత్రం విడుదల కానుంది.

దశాబ్దంపాటు సాగే ప్రేమ ప్రయాణం



శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో నాగశౌర్య, మాళవిక నాయర్ జంటగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం నుండి తాజాగా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'ఈ చిత్రం ఒక దశాబ్దం పాటు ఓ జంట మధ్య సాగే ప్రేమ ప్రయాణం. హెచ్చు తగ్గులతో కూడిన ఆ ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చిత్రం 18 సంవత్సరాల నుండి 28 సంవత్సరాల వయస్సు వరకు సాగే వారి ప్రయాణంలోకి ప్రేక్షకులను తీసుకువెళుతుంది. ఇందులో ప్రేమ సన్నివేశాలు చాలా సహజంగా హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి. ఈ చిత్రంలో ప్రేమను ఇంద్రధనస్సు లాగా ఏడు విభిన్న రంగులలో ప్రదర్శించబోతున్నామని దర్శకుడు తెలిపారు. శ్రీనివాస్ అవసరాల సంభాషణలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర నిర్మాతలు చెబుతున్నారు. విడుదల తేదీతో పాటు సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.


జీవితం ఇంతకు ముందులా లేదు..



అభిమానులు చూపించే ప్రేమాభిమానాలు, తన కోసం వాళ్లు చేసే ప్రార్థనల వల్లే తాను ధైర్యంగా ఉన్నానని సమంత అంటున్నారు. ప్రస్తుతం తన జీవితం ఇంతకు ముందులా లేదంటూ ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు సమంత. మయోసైటిస్‌తో పోరాటం చేస్తూ గత కొంతకాలంగా ఇంటికే పరిమితమైన ఆమె తాజాగా ట్విటర్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. ఇందులో భాగంగా ఓ నెటిజన్ 'మేడమ్ మీ జీవితం ఎలా సాగుతోంది' అని ప్రశ్నించగా.. 'విభిన్నంగా ఉంది' అని బదులిచ్చారు. శాకుతలం పోస్టర్ విడుదలైన కొంతసేపటికి ఆమె ట్విట్టర్ వేదికగా అభిమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాను ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు.

జానకి వల్లభ్‌కు సిఐటియు ఘన నివాళి

• అంతర్జాతీయ విభాగానికి ఆయన సేవలు వెలగట్టలేనివి : తపన్‌సేన్



న్యూఢిల్లీ : చైనా భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతిపై సుదీర్ఘకాలం కృషి చేసిన జానకి వల్లభ్ మృతికి సిఐటియు ఘన నివాళి అర్పించింది. తనకున్న అంతర్జాతీయ అనుభవాన్ని సిఐటియు కోసం వినియోగించారని, వివిధ దేశాల ట్రేడ్ యూనియన్లతో సంబంధాలు నెరపారని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. సిఐటియు అంతర్జాతీయ విభాగంలో అత్యంత సుదీర్ఘకాలం జానకి వల్లభ్ పనిచేశారని, విభాగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటంలో ఆయన కృషి ఎంతోవుందని తపన్‌సేన్ చెప్పారు. చైనీస్ అనువాద సాహిత్యంలో ఎనలేని సేవలు అందించిన జానకి వల్లభ్ డిసెంబర్ 30న వృద్ధాప్య సమస్యలతో 94ఏళ్ల వయసులో చైనాలోనే కన్నుమూశారు. దశాబ్దానికిపైగా చైనాలోనే తన కుమారులతో కలిసి ఉంటున్నారు. సిఐటియు వర్కింగ్ కమిటీకి ఎన్నికయ్యారు. ఉత్తరాఖండ్‌కు చెందిన జానకి వల్లభ్ 1956లో చైనాకు వెళ్లారు. అక్కడ ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్‌లో పనిచేశారు. చైనీస్ రచనలను హిందీలోకి అనువదించారు. మావో జెడాంగ్‌కు చెందిన 'సెలెక్టెడ్ వర్క్స్', చైనీస్ క్లాసిక్ నవల 'జర్నీ టు ది వెస్ట్', ప్రముఖ చైనీస్ రచయిత లు జున్ రచనల్ని హిందీలోకి అనువదించారు. ఇటీవలి కాలంలో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ పుస్తకం 'ది గవర్నెన్స్ ఆఫ్ చైనా' మొదటి, రెండవ సంపుటాన్ని హిందీలోకి రచించారు. వల్లభ్ భారత్‌లోని చైనా రాయబార కార్యాలయంలో పనిచేశారు. ఆ తర్వాత ఎం.కె.పాండే, సిఐటియుతో సన్నిహితంగా ఉన్నారు. పాండే మార్గదర్శకత్వంలో సిఐటియు అంతర్జాతీయ విభాగాన్ని అభివృద్ధి చేశారు. వివిధ దేశాల ట్రేడ్ యూనియన్ ఉద్యమంతో సంబంధాలు ఏర్పరచుకోవడంలో కీలకమైన కృషి చేశారని సిఐటియు గుర్తుచేసుకుంది. ఆయన మృతికి ఘనమైన నివాళి అర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది.

యువ క్రికెటర్లపైనే ఆశలు

• శ్రీలంకతో తొలి టి20 నేడు..



సాయంత్రం 7.00గం.కు స్టార్‌స్పోర్ట్స్‌లో

ముంబయి: నూతన సంవత్సరంలో టీమిండియా తొలి పరీక్షకు సిద్ధమైంది. శ్రీలంకతో మంగళవారం తొలి టి20లో తలపడనుంది. భారత్-శ్రీలంక జట్ల మధ్య జరిగే మూడు టి20ల సిరీస్‌లో భాగంగా జరిగే తొలి టి20కి ముంబయి లోని వాంఖడే స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. స్వదేశంలో జరిగే ఈ సిరీస్ భారతజట్టుకు తొలిసారి హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. సీనియర్ క్రికెటర్లు రోహిత్, ధావన్, కోహ్లి, కెఎల్ రాహుల్ విశ్రాంతితో ఈ సిరీస్‌కు దూరం కావడంతో యువ క్రికెటర్లపై గంపె డాశలున్నాయి. కొత్త ఏడాదిని విజ యంతో ఆరంభించేందుకు టీమిండియా సిద్ధమౌతోంది. భారత పర్యటనకు వచ్చిన శ్రీలంక మూడేసి టి20, వన్డే సిరీస్‌లలో తలపడనుంది. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌కు దూరమైనా.. వన్డేలకు అందుబాటులోకి రానున్నారు. అదే విధంగా యువ ఆటగాళ్లు శివమ్ మావి, ముకేశ్ కుమార్ తొలి సారి భారత జట్టులో చోటు దక్కించుకున్నారు. మరోవైపు వన్డేలు, టెస్టులలో అదరగొడుతున్న యవ ఓపెనర్ శుబ్‌మాన్ గిల్‌కు కూడా టి20 జట్టులో చోటు దక్కింది. కాగా న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు గిల్‌కు చోటు దక్కినప్పటికీ.. తుది జట్టులో మాత్రం అవకాశం దక్కలేదు.

టీ20ల్లో గిల్ అరంగేట్రం

ముంబయి వేదికగా శ్రీలంకతో జరగనున్న తొలి టీ20 అంతర్జాతీయ అరంగేట్రం చేయనున్నాడు. తెలుస్తోంది. రెగ్యూలర్ ఓపెనర్లు రోహిత్, రాహుల్ దూరం కావడంతో కిషన్‌కు జోడిగా గిల్‌ను పంపాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమా చారం. అదే విధంగా యువ పేసర్ శివమ్ మావి కూడా అంతర్జాతీయ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. మరోవైపు తొలి టి20కు ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, చాహల్‌ను పక్కన పెట్టాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో వాషింగ్టన్ సుందర్, వెటరన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం దక్కవచ్చు.

లంకేను తక్కువ అంచనా వేయొద్దు..

ఆసియా కప్ విజేత శ్రీలంకను తక్కువగా అంచనా వేయడం పొరపాటే అవుతుంది. ఆ జట్టులోనూ స్టార్ ప్లేయర్లకు కొదవేంలేదు. అవిష్క ఫెర్నాండో, చమిక కరుణరత్నె, సదీర సమరవిక్రమ, డాసున్ శనక, కుశాల్ మెండిస్, భానుక రాజపక్స, హసరంగ, తీక్షణ తదితరులు టీ20 స్పెషలిస్టులు. బౌలింగ్‌తో హసరంగ, తీక్షణ మ్యాచ్‌ను మలుపు తిప్పగలిగే సత్తా ఉంది.

జట్లు..

ఇండియా: హార్దిక్(కెప్టెన్), ఇషాన్, సంజు(వికెట్ కీపర్లు), సూర్యకుమార్(వైస్ కెప్టెన్), గైక్వాడ్, శుభ్‌మన్, దీపక్ హుడా, త్రిపాఠి, సుందర్, చాహల్, అక్షర్, అర్ష్‌దీప్, హర్షల్, ఉమ్రన్, శివమ్ మావి, ముఖేష్ కుమార్.

శ్రీలంక: శనక(కెప్టెన్), నిస్సంక, అవిష్కా ఫెర్కాండో, సమరవిక్రమ, కుశాల్ మెండీస్, రాజపక్సె, అసలంక, ధనుంజయ, హసరంగ(వైస్ కెప్టెన్), భండార, తీక్షణ, కరుణరత్నే, మధుశనక, రజిత, వెల్లాలగె, మధుశూదన్, కుమార.

రామ్‌కుమార్ గెలుపు..

సుమిత్, బాంబ్రీ పరాజయం

చెన్నై: టాటా ఓపెన్ టెన్నిస్ టోర్నీ-250 మెయిన్ డ్రాకు అర్హత సాధించేందుకు రామ్ కుమార్ రామనాథన్ అడుగు దూరంలో నిలువగా.. యువ టెన్నిస్ ఆటగాళ్లు సుమిత్ నాగల్, యుకీ బాంబ్రీ పరాజయాల్ని చవిచూసి మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయారు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో రామ్‌కుమార్ రామనాథన్ 6-3, 7-5తో మట్టియ బెలాకాను వరుససెట్లలో ఓడించి టాప్-4లో నిలిచాడు. ఇతర పోటీల్లో సుమిత్ 4-6, 6-4, 4-6తో ఫిలిప్ క్రాజినోవిక్(అమెరికా)పై పోరాడి ఓడాడు. తొలి సెట్‌ను ఓడిన నాగల్.. రెండో సెట్‌లో పుంజుకొని క్రాజినోవిక్‌కు ఝలక్ ఇచ్చాడు. మూడో సెట్‌లోనూ హోరాహోరీగా తలపడిన నాగల్ ఆ సెట్‌ను 4-6తో చేజార్చుకొని ఓటమిపాలయ్యాడు. మరో పోటీలో యుకీ బాంబ్రీ 6-1, 6-4తో ఎలియస్ యేమర్ చేతిలో వరుససెట్లలో ఓడి టోర్నీకి అర్హత సాధించలేకపోయారు.

ఆంధ్ర-హైదరాబాద్ రంజీ మ్యాచ్ నేటినుంచే..

విజయనగరం: ఆంధ్ర-హైదరాబాద్ జట్ల మధ్య రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి లీగ్ మ్యాచ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. విజయనగరం, చింతలవలసలోని ఏసిఏ స్పోర్ట్స్ మైదానంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఆంధ్ర జట్టుకు హనుమ విహారి, హైదరాబాద్ జట్టుకు భావేశ్ సేథ్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. ఈ గ్రూప్‌లో ఆంధ్రజట్టు 3 మ్యాచ్‌ల అనంతరం 6పాయింట్లతో 5వ స్థానంలో ఉండగా.. హైదరాబాద్ జట్టు 2మ్యాచుల్లో ఓడి, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకొని 1 పాయింట్‌తో 8వ స్థానంలో ఉంది. ఇరుజట్లు నాకౌట్ రేసులో నిలవాలంటే గెలుపు తప్పనిసరి.

కాన్వే సెంచరీ

న్యూజిలాండ్ 309/6

కరాచీ: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండోటెస్ట్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డెవన్ కాన్వే(122) సెంచరీతో కదం తొక్కాడు. మరో ఓపెనర్ లాథమ్(71) కూడా రాణించడంతో న్యూజిలాండ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్లు కోల్పోయి 309పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు లాథమ్-కాన్వే శుభారంభాన్నిచ్చారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు సెంచరీ(131పరుగులు) భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరి జంటను నసీమ్ షా బ్రేక్ చేశాడు. ఆ తర్వాత విలియమ్సన్(36), నికోలస్(26) రాణించినా.. మిఛెల్(3), బ్రాస్‌వెల్(0) నిరాశపరిచారు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి బ్లండెల్(30), ఇష్ సోధీ(11) క్రీజ్‌లో ఉన్నారు. అహా సల్మాన్‌కు మూడు, నసీమ్ షాకు రెండు, అహ్మాకు ఒక వికెట్ లభించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68